మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 32 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada

శనివారం 06 ఏప్రిల్ 2024



# ఐదు న్యాయాలు.. పాతిక గ్యారెంటీలు

- న్యాయ్‌పత్రపేరుతో మేనిఫెస్టో ప్రకటన
- విడుదలకు వేదిక కానున్న తుక్కుగూడ
- పంటలకు కనీస మద్దతు ధరలు
- వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రద్దు
- మహిళలకు ఉద్యోగాల్లో 50% రిజర్వేషన్లు
- దేశవ్యాప్తంగా కులగణన నిర్వహణ
- విద్యారుణాల రద్దుకు నిర్ణయం
- పెట్రోల్,డీజిల్ ధరల తగ్గింపు
- ప్రతి పేదకుటుంబానికి ఏటా రూ.లక్ష నగదు
- యువతకు 30 లక్షల ఉద్యోగాల కల్పన
- రిజర్వేషన్లపై 50% పరిమితి తొలగింపు
- రైల్వేల ప్రైవేటీకరణ నిలిపవేత..అగ్నిపథ్ రద్దు
- ఎలక్టోరల్ బాండ్స్,పెగాసస్, రఫేల్ అంశాలపై పూర్తి స్థాయి విచారణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ప్రజా మంటలు):** ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజాకర్షక మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వచ్చింది. అన్ని వర్గాలను అక్కున చేర్చుకుని ముందుకు సాగే లక్ష్యంతో ఆకర్శణీయమైన, ఆచరణసాధ్యమైన హామీలను పొందుపర్చిన మేనిఫెస్టోను ప్రకటించింది. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. 48 పేజీలతో కూడిన మ్యానిఫెస్టోను పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో కలిసి విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న రైతాంగానికి అవసరమయ్యే విధంగా పంటకు కనీస మద్దతు ధర నిర్ణయించి దానికి చట్ట భద్రత కల్పిస్తామని ఖర్గే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేసింది. ఎన్నో రోజులుగా ఊరిస్తూ వచ్చిన పార్టీ మొత్తానికి హామీలను ప్రకటించింది. పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీ పేరుతో ఈ మేనిఫెస్టోని విడుదల చేసింది. మొత్తం 25 హామీలు వెల్లడించింది. సామాజిక సంక్షేమ పథకాలతో పాటు 25 గ్యారెంటీలు చేర్చింది. దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 8 కోట్ల కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించింది. రిజర్వేషన్‌లపై ప్రస్తుతం ఉన్న 50శాతం పరిమితిని తొలగిస్తామని హామీ ఇచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామని తెలిపింది. వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చింది. రైల్వేల ప్రైవేటీకరణను నిలిపివేస్తామని మిగతా 2లో..

# జనజాతరకు తుక్కుగూడ సిద్ధం

- అసెంబ్లీ తరహాలో చరిత్ర సృష్టించాలి
- పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సభ ఏర్పాట్లు పరిశీలించిన సీఎం

**హైదరాబాద్,ఏప్రిల్ 5 (ప్రజా మంటలు):** అసెంబ్లీ ఎన్నికల సమరాన్ని ఏ వేదిక నుంచి ప్రారంభించిందో.. అదే వేదిక నుంచి లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. బిఆర్ఎస్, బిజెపిలను తుంగలో తొక్కి తమ ప్రాబల్యం చాటుకోవడంతో పాటు, అత్యధిక పార్లమెంట్ సీట్లు లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. వివిధ పథకాలతో ఇప్పటికే ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న కాంగ్రెస్ శనివారం నాటి తుక్కుగూడ సభతో చరిత్ర సృష్టించాలని చూస్తోంది. జనజాతర సభ మోత మోగిస్తామని కాంగ్రెస్ అగ్రనేతలు ఢంకాబజాయించి చెబుతున్నారు. సభను విజయవంతం చేసేందుకు సిఎంతో సహా మంత్రులంతా రోజూ సందరిశించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం జరిగే సభకు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే, వేణుగోపాల్ తదితరులు హాజరు కాబోతున్నారు. పార్టీ మేనిఫెస్టోను ఇక్కడే విడుదల చేయబోతున్నారు. మరోవైపు తుక్కుగూడను సెంటిమెంట్‌గా భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ. అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ నుంచే ఎన్నికల సమరాన్ని ప్రారంభించి విజయం సాధించడంతో.. ఇప్పుడు ఈ జనజాతర సభతో చరిత్ర సృష్టించాలని అనుకుటున్నారు. మరోవైపు తుక్కుగూడ సభ తర్వాత కాంగ్రెస్ మరింత దూకుడుగా ముందుకెళ్తుందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. టిక్కెట్ల కేటాయింపులో కొంత జాప్యం, ఒడిదుడుకులు, పోటీ చేసే అభ్యర్థులు లేకుండా పోవడం వంటి సమస్యలు ఉన్నా సత్తా చాటాలని సిఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. పిసిసి చీఫ్‌గా, తెలంగా సిఎంగా ఆయనకు ఇది తొలి పరీక్షగా చెప్పుకోవాలి. మొత్తంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి రెడీ అవుతోంది. అసెంబ్లీ ఎన్నికలు ఇచ్చిన ఉత్సాహంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ భారీ విజయం సాధించాలన్న లక్ష్యంతో మిగతా 2లో..



## రష్యాకు భారీ ఎదురుదెబ్బ

- ఎయిర్‌బేస్‌పై విరుచుకుపడిన ఉక్రెయిన్
- ఆరు యుద్ధ విమానాలు ధ్వంసం..

**మాస్కో ఏప్రిల్ 5 (ప్రజా మంటలు):** ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎస్‌బీయూ, సైన్యం సంయుక్తంగా భారీ స్థాయిలో రష్యాపై దాడి చేశాయి. దక్షిణ రోస్టవ్‌లోని మోరోజోవ్స్క్ వైమానిక స్థావరంపై నిన్న రాత్రి జరిగిన ఈ దాడిలో ఆరు విమానాలు పూర్తిగా ధ్వంసం కాగా..మరో ఎనిమిది వరకు తీవ్రంగా దెబ్బతిన్నాయని బారెన్స్ వార్తా సంస్థ పేర్కొంది. డజన్ల సంఖ్యలో డ్రోన్లను ఉపయోగించినట్లు తెలుస్తోంది. తాము 44 డ్రోన్లను కూల్చివేశామని రష్యా రక్షణశాఖ పేర్కొంది. ఓ పవర్ సబ్‌స్టేషన్ కూడా ఈ దాడిలో దెబ్బతిన్నట్లు సమాచారం.ఈ వైమానిక స్థావరంలో మొత్తం సు-24, సు-34, ఇతర టాక్టికల్ బాంబర్ విమానాలను ఉంచుతారు. దీనిని మిగతా 2లో..

## ప్రధాని ఎవరన్నది ఫలితాల తరవాతే నిర్ణయం

ఇండియా కూటమిదే ఘన విజయం - కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ప్రజా మంటలు):** అందరి అంచనాలు తప్పుతాయని, ఇండియా కూటమి గన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని ఎవరన్నది కూటమి నేతలు నిర్ణయిస్తారని అన్నారు. మీడియా ప్రచారం చేస్తున్నట్లుగా బిజెపి గెలుపు అసాధ్యమని అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయాలనుకుంటున్న శక్తులకు, వాటిని పరిరక్షించేందుకు నడుం బిగించిన శక్తులకు మధ్య జరుగుతున్న పోరాటమే 2024 లోక్‌సభ ఎన్నికలని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎన్నికల తర్వాతే 'ఇండియా' కూటమి ప్రధానమంత్రి అభ్యర్థి ఎంపిక ఉంటుందని చెప్పారు. శుక్రవారంనాడిక్కడ పార్టీ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన అనంతరం రాహుల్ మాట్లాడుతూ, మీడియా ప్రచారం చేస్తున్నట్టు కాకుండా చాలా పోటీపోటీగా ఈ ఎన్నికలు ఉండనున్నాయని, ఎన్నికల్లో ఇండియా' కూటమి గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2004లోనూ 'ఇండియా షైనింగ్' అంటూ బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రచారం చేశారని, అయితే అప్పటి ఎన్నికల్లో ఎవరు గెలిచారో అందరికీ తెలిసిందేనని, బీజేపీ ఓటమి చవిచూస్తే ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. సైద్ధాంతిక పరమైన ఎన్నికలు గానే 'ఇండియా' కూటమి ఈసారి ఎన్నికల బరిలోకి దిగుతోందని, ఎన్నికల తర్వాతే ప్రధానమంత్రి అభ్యర్థి ఎంపిక ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో పలు కీలకాంశాలు చోటుచేసుకున్నాయి. 'పాంచ్ న్యాయ్' సూత్రం ఆధారంగా ఒక్కోన్యాయ్ కింద ఐదు హామీలు చొప్పున మొత్తం 25 హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. రైతు మిగతా 2లో..


## చల్లని కబురు

- ఈసారి నైరుతి రుతుపవనాలకు అన్నీ అనుకూల పరిస్థితులు
- భారత వాతావరణ శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ప్రజా మంటలు):** దేశంలో అనేక ప్రాంతాలు తీవ్ర ఎండను ఎదుర్కొంటున్న తరుణంలో ఊరటనిచ్చే అంశాన్ని చెప్పారు వాతావరణ శాస్త్ర వేత్తలు. ఈ ఏడాది ఎల్?నినో పరిస్థితులు తగ్గిపోవడం, యురేషియాలో తగ్గిన మంచు కవచంతో నైరుతి రుతుపవనాలు సానుకూలంగా ఉంటాయని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. "మనదేశంలో ఎల్ నినో క్షీణిస్తుండటం గుడ్ న్యూస్ లాంటిది. జూన్ నెల మొదలయ్యే సమయానికి ఎల్ నినో తగ్గిపోయే మిగతా 2లో..



## ప్రజా నాడి






## మాల్దీవులకు బియ్యం, చక్కెర

- ఎగుమతికి గ్రీన్‌సిగ్నల్
- ఆంక్షలు సడలింలించిన భారత్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ప్రజా మంటలు):** మాల్దీవుల నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ ముయిజ్జు.. మొదటినుంచి భారత్‌పై వ్యతిరేక వైఖరి అవలంబిస్తోన్న విషయం తెలిసిందే. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.అయినప్పటికీ ద్వైపాక్షిక ఒప్పందాలను భారత్ గౌరవిస్తోంది. ఈక్రమంలో మాల్దీవుల కు నిత్యావసర వస్తువుల ఎగుమతిపై ఉన్న ఆంక్షలను తొలగించింది. బియ్యం, చక్కెర, ఉల్లిపాయలు, గోధుమపిండి వంటి వస్తువులను నిర్దిష్ట స్థాయిలో ఎగుమతి మిగతా 2లో..

## మూడు పిల్లర్లు కూలితే ఏమైతది?

- ఏ ఉపద్రవం ముంచుకొచ్చింది?
- బీఆర్ఎస్ చీఫ్ అసహనం
- పంటలకు నీరందించడంలో కొరవడిన ముందుచూపు
- మేము సస్యశ్యామలం చేసిన రాష్ట్రం ఆగమైంది
- నాలుగు నెలల్లోనే పాలన అస్తవ్యస్థం
- రైతుబంధు, రుణమాఫీ, దళితబందు, తులం బంగారం ఏమయ్యాయి?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు



**కరీంనగర్ ఏప్రిల్ 1 (ప్రజా మంటలు):** కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే వ్యవసాయరంగం సంక్షోభంలో పడిందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ వైఫల్యమేనని అన్నారు. నాలుగైదు నెలల్లోనే కరీంనగర్ ఏడారి అయ్యిందని అన్నారు. దళితబందు, రైతు రుణమాఫీ, కళ్యాణలక్ష్మిలో తులం బంగారం వంటి హామీలను నెరవేర్చనందుకు వీరంతా కర్రుకాల్చి వాతలు పెట్టడం ఖాయమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు రెఫరెండం అంటున్న వీరికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 'పొలంబాట'లో భాగంగా శుక్రవారం నాడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. సాగునీరందక ఎండిపోయిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## జనజాతరకు తుక్కుగూడ సిద్ధం

ముందుకెళ్తోంది. ఈ మేరకు ఏప్రిల్ 6వ తేదీ శనివారం నాడు హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో జనజాతర పేరుతో భారీ బహిరంగ నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సభకి అగ్రనేతలు హాజరకానుండటంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. తుక్కుగూడలోని 60 ఎకరాల విశాలమైన మైదానంలో జనజాతర బహిరంగ సభ జరగనుంది. వాహనాల పార్కింగ్‌కు సుమారు 300 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ సభకు ఆదిలాబాద్ మొదలు ఆలంపూర్ వరకు, జహీరాబాద్ నుంచి భద్రాచలం వరకు అన్నిగ్రామాలు, పట్టణాలు, నగరాల నుంచి ప్రజలను పెద్ద ఎత్తున తరలించడానికి ఏర్పాట్లు చేసుకుంటు న్నారు. కనీసం పది లక్షల మంది జనజాతరకు హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలోనే సభ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎంత పెద్ద మొత్తంలో ప్రజలు తరలివచ్చినా ఎటువంటి లోటుపాట్లు జరగొద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మేనిఫెస్టో విడుదలతో పాటు దేశం మొత్తం జనజాతర సభ వైపు చూసేలా ఉంటుందన్నారు.

### ప్రధాని ఎవరన్నది ఫలితాల తరవాతే నిర్ణయం

న్యాయం, మహిళా న్యాయం, యువత న్యాయం, కార్మిక న్యాయం, భాగస్వామ్య న్యాయం వంటి ఐదు న్యాయ్‌లు ఇందులో ఉన్నాయి. పేద మహిళలకు ఏటా లక్ష రూపాయలు, కేంద్ర ప్రభుత్వ కొత్త ఉద్యోగాల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్లు, కులగణన నిర్వహించడం, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని రద్దు చేయడం, రైతులకు కనీస మద్దతు ధర, రుణమాఫీ కమిషన్ ఏర్పాటు, కార్మికులకు ఆరోగ్యంపై హక్కుల కల్పన వంటి హామీలు ఇందులో ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19తో మొదలై ఏడు విడతల్లో పూర్తి కానున్నాయి.

# ఐదు న్యాయాలు.. పాతిక గ్యారెంటీలు

స్పష్టం చేసింది. యువతకు 30 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించింది. అగ్నివీర్ స్కీమ్‌ని రద్దు చేస్తామని తెలిపింది. మహాలక్ష్మి పథకం ద్వారా పేద కుటుంబానికి ఏడాదికి రూ.లక్ష నగదు అందిస్తామని హామీ ఇచ్చింది. కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారెంటీ కూడా ఈ హామీల జాబితాలో ఉంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని మరో ఆసక్తికర హామీని చేర్చింది. యువకులు, మహిళలతో పాటు రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఈ మేనిఫెస్టోని రూపొందించింది కాంగ్రెస్. అన్ని వర్గాలకూ సమన్యాయం జరిగేలా చూస్తామన్న సంకేతమిచ్చేలా పాంచ్ న్యాయ్ పేరిట ఈ హామీలను తయారు చేసింది. యువ న్యాయ్, నారీ న్యాయ్, కిసాన్ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, హిస్సేదారి న్యాయ్ పేరిట వీటిని ప్రకటించింది. దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ డేటా ఆధారంగా ఆయా వర్గాల సంక్షేమానికి సహకరిస్తామని వెల్లడించింది. రిజర్వేషన్‌లపై ఇప్పటి వరకూ ఉన్న 50 శాతం పరిమితి తొలగిస్తామని స్పష్టం చేసింది. దీంతో షెడ్యూల్ తెగలు,షెడ్యూల్ కులాలకు మేలు జరుగుతుందని వివరించింది. కులగణన తరవాత ఈ 50 శాతం పరిమితిని తొలగించేలా రాజ్యాంగంలో సవరణలు చేస్తామని తెలిపింది. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకి చెందిన వాళ్లకి విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని వెల్లడించింది. . ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ ఉద్యోగాల్ని రెగ్యులరైజ్ చేయడాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ వెల్లడించింది. ఎలక్టోరల్ బాండ్స్‌పై విచారణతో పాటు పెగాసస్, రఫేల్ అంశాలపైనా పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని హామీ ఇచ్చింది. అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని స్పష్టం చేసింది. పాతపద్ధతిలోనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ చేస్తామని వెల్లడించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు వ్యవసాయ పరికరాలపై జీఎస్‌టీని మినహాయిస్తామని హామీ ఇచ్చింది.

దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ చేస్తామని వెల్లడించారు. వ్యవసాయ పరికరాలకు జీఎస్టీ రద్దు చేస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ. 4 వందలు ఇస్తామని హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టోలో సామాజిక సంక్షేమ పథకాలతో పాటు 25 గ్యారెంటీలను పొందుపరిచారు. ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమ సూత్రాలపై దీనిని రూపొందించినట్లు మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ చిదంబరం వివరించారు. గత పదేళ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలేదని, అన్నిరంగాల్లో విధ్వంసం జరిగిందని ఆయన అన్నారు. అధికారంలోకి రాగానే పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడారు. మా మేనిఫెస్టోను పేదలకు అంకితం చేస్తున్నాం. దేశ రాజకీయ చరిత్రలో న్యాయ పత్రాలుగా దీనిని ప్రజలు గుర్తుంచుకుంటారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో అందిస్తామన్న ఐదు న్యాయాలు, 25 గ్యారంటీలు దీనిలో ఉన్నాయి. 'యువ న్యాయ్' కింద ప్రతి విద్యావంతుడికి అప్రెంటీస్‌గా పనిచేసే అవకాశం కల్పిస్తాం. దీని కోసం ఒక్కొక్కరిపై రూ.లక్ష వెచ్చిస్తాం. 'మహిళా న్యాయ్' కింద పేద ఇంటి ఆడవారికి ఏటా రూ.లక్ష సాయం చేస్తాం. 'కిసాన్ న్యాయ్' కింద రైతులకు రుణమాఫీ, ఎంఎస్‌పీ చట్టాలకు హామీ ఇస్తున్నాం. 'శ్రామిక్ న్యాయ్' కింద ఉపాధి హామీ పథకంలో కనీసం రూ.400 వేతనం ఇస్తాం. 'హిస్సేదార్ న్యాయ్'లో సామాజిక, ఆర్థిక సమానతల కోసం జాతీయ జనగణన చేపడతాం. ఇది ఎవరికీ వ్యతిరేకంగా కాదు. కేవలం ప్రజల స్థితిగతులపై అవగాహన కోసమే చేపడుతున్నాం. రాష్ట్రాలకు అందాల్సిన నిధులను ఇస్తాం. 'రక్షా న్యాయ్' కింద విదేశీ వ్యవహారాల్లో కూడా మార్పులు తీసుకొస్తాం. మేం చేయగలిగిన అంశాలనే మేనిఫెస్టోలో చేర్చామని అన్నారు. మోదీ హయాంలో ఒక్కటైనా పెద్ద ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇచ్చారా..? కేవలం తిట్లు తప్పితే ఆయన పాలనలో మరేమీ వినలేదు. విపక్ష నేతలను జైళ్లలో పెడుతున్నారు. ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పించడంలేదు. మా పార్టీపై రూ.3,500 కోట్ల జరిమానాలు విధించారు. నేడు మాపై జరిగినవి.. రేపు మీడియాపై జరగవచ్చు. దేశ ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు ప్రజలు ఏకమై పోరాడి మోదీని గద్దె దించాలి. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్టీ హామీలును వారి వద్దకు చేర్చాలి. అవినీతిపరులను పార్టీలో చేర్చుకొని భాజపా మమ్మల్ని నిందిస్తోంది. ప్రధాని ఇప్పటి వరకు భయపడి మణిపుర్ వెళ్లలేదు.. మా నేత రాహుల్ అక్కడికి వెళ్లారు. భయపడే నేత దేశానికి మంచి చేయలేరని ఖర్గే పేర్కొన్నారు. వర్కింగ్ కమిటీలో పూర్తిస్థాయిలో చర్చించి మేనిఫెస్టోను తయారు చేసినట్లు పార్టీ నేత, దీని కమిటీ ఛైర్మన్ పి.చిదంబరం తెలిపారు. గత పదేళ్లలో అన్ని రకాల న్యాయాలు ప్రజలకు అందలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను పనిచేయనీయకపోవడం, బలహీన వర్గాల అణచివేత కొనసాగుతోందన్నారు. పార్లమెంట్ వ్యవస్థను కూడా బలహీనపర్చారని ఆరోపించారు. గత పదేళ్లలో దేశానికి జరిగిన నష్టాన్ని పూడ్చేలా మేనిఫెస్టోను సిద్ధం చేసినట్లు తెలిపారు. 'వర్క్, వెల్త్, వెల్ఫేర్'(ఉద్యోగాలు, సంపద, సంక్షేమం)ను ప్రజలకు అందిస్తామన్నారు. యూపీఏ తొలి విడత పాలనలో 8.5 శాతం వృద్ధి సాధించామని తెలిపారు. గత పదేళ్లలో దేశం 5.9 శాతం మాత్రమే వృద్ధి సాధించిందని గుర్తు చేశారు. యూపీఏ ప్రభుత్వం 24 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చిందని.. 2024లో అధికారం చేపట్టాక మరో 23 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పిస్తామని చిదంబరం పేర్కొన్నారు. మార్చి 15 నాటికి ఉన్న విద్యా రుణాల మొత్తం రద్దు చేస్తాం. ఆ సొమ్మును ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుంది. మైనార్టీలకు వస్త్రధారణ, ఆహారం, భాష, పర్సనల్ లాను ఎంచుకొనే హక్కు ఇస్తాం. తప్పుడు వార్తల నియంత్రణకు 1978 నాటి ప్రెస్ కౌన్సిల్ ఇండియా చట్టాన్ని సవరిస్తాం అని వెల్లడించారు.

## చల్లని కబురు

అవకాశం ఉంది. అదే జరిగితే నైరుతి రుతుపవనాలు యాక్టివ్ అయిపోతాయి. రుతుపవనాల సీజన్ జులై-సెప్టెంబర్ రెండో అర్ధభాగంలో మన దేశంలో లా నినా పరిస్థితులు ఏర్పడొచ్చు" అని ఆయన తెలిపారు.దేశంలో రుతుపవనాలపై ఉత్తర హిమాలయాలు, యురేషియా భూభాగంపై ఉండే మంచు కవచం ప్రభావం చూపిస్తాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. 'ఎల్ నినో' ఎఫెక్ట్? కూడా ఎక్కువగానే ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ఉత్తర హిమాలయాలు, యురేషియా భూభాగంపై మంచు కవచం తక్కువ మోతాదులోనే ఉందని, ఇది రుతుపవనాలకు కలిసొచ్చే పరిణామమని ఆయన పేర్కొన్నారు."గడిచిన కొన్నేళ్లలో సగానికిపైగా వ్యవధిలో (దాదాపు 60 శాతం) రుతుపవనాలపై ఎల్ నినో ప్రతికూల ప్రభావాన్ని చూపించింది. గత ఏడాది రుతుపవనాల సీజన్‌లో మన దేశంలో సగటున 820 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. దేశవ్యాప్తంగా ఏటా కురిసే సగటు వర్షపాతం 868.6 మి.మీతో పోలిస్తే ఇది చాలా తక్కువ. 'ఎల్ నినో' ఎఫెక్టు వల్లే గత సంవత్సరం వర్షపాతం తగ్గింది" అని ఐఎండీ డైరెక్టర్ వివరించారు. కాగా, నైరుతి రుతుపవనాల సూచనలను ఈ నెలాఖరులోనే భారత వాతావరణ విభాగం(ఐఎండీ) విడుదల చేయనుంది.నైరుతి రుతు పవనాలు మన దేశ వ్యవసాయ రంగానికి ఆరోప్రాణం లాంటివి. భారతదేశ వార్షిక వర్షపాతంలో 70 శాతాన్ని ఇవే అందిస్తాయి. భారత స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో 14 శాతం వాటాను నైరుతి రుతు పవనాలు ప్రభావితం చేస్తుంటాయి. ఇందులో ఎక్కువ భాగం వ్యవసాయ, దాని అనుబంధ రంగాల నుంచి సమకూరుతోంది. దేశంలోని 140 కోట్ల జనాభాలో దాదాపు సగం మంది జీవన ప్రమాణాలు, తలసరి వ్యయాలు నైరుతి రుతు పవనాల గమనం ఆధారంగానే నిర్ణయమవుతాయి. ఎందుకంటే నైరుతి రుతుపవనాల ప్రభావంతో చాలా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఈ వర్షపాతం ఆధారంగానే ఆయా ప్రాంతాలలో పంటల సాగు ఏ స్థాయిలో ఉంటుందనేది నిర్ణయమవుతుంది.

## మాల్దీవులకు బియ్యం, చక్కెర

చేసేందుకు సిద్ధమైంది.లోక్‌సభ ఎన్నికల ముందు స్థానికంగా పెరుగుతోన్న నిత్యావసర ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులోభాగంగా బియ్యం, చక్కెర, ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించింది. ఈక్రమంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇరుదేశాల మధ్య జరిగిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా వీటి ఎగుమతులపై మినహాయింపు ఇస్తున్నట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ తెలిపింది. మాల్దీవులకు 1,24,218 మెట్రిక్ టన్నుల బియ్యం, 1,09,162 టన్నుల గోధుమ పిండి, 64,494 టన్నుల చక్కెర, 21,513 టన్నుల బంగాళదుంప, 35,749 టన్నుల ఉల్లి, 42.75 కోట్ల కోడిగుడ్లు ఎగుమతి చేసేందుకు భారత్ అనుమతించింది. వీటితోపాటు 10లక్షల టన్నుల కంకర, ఇసుక కూడా ఎగుమతి చేయనుంది. ఇదిలాఉంటే, చైనా అనుకూల పంథాను అనుసరిస్తోన్న మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు.. భారత్‌తో కఠినంగా వ్యవహరిస్తున్నారు. తమ భూభాగం నుంచి భారత సైనిక దళాలు వెళ్లిపోవాలంటూ మొదట్లో హెచ్చరించడం ఇరుదేశాల సంబంధాలపై ప్రభావం చూపింది.

## రష్యాకు భారీ ఎదురుదెబ్బ

రష్యా పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు వినియోగిస్తారు. భద్రతా దళాలకు చెందిన దాదాపు 20 మంది వరకు సిబ్బంది ఈ దాడిలో మరణించి ఉంటారని కీవ్ ఇండిపెండెంట్ అంచనా వేస్తోంది. రష్యా వాయుసేన శక్తిని ఈ దాడి గణనీయంగా తగ్గిస్తుందని ఉక్రెయిన్ చెబుతోంది. మొత్తం 53 డ్రోన్లను ఏకకాలంలో ప్రయోగించినట్లు సమా చారం. ఈ ఎయిర్‌బేస్ వద్ద భారీగా పేలుళ్లు జరుగుతున్న వీడి యో వైరల్‌గా మారింది. మరోవైపు బెల్గరోడ్, కరుస్క్ వద్ద కూడా ఉక్రెయిన్ డ్రోన్లు దాడులకు యత్నించాయి.దాదాపు ఏడాది నుంచి రష్యా భూభాగంపై కూడా ఉక్రెయిన్ విజయవంతంగా దాడులు చేస్తోంది. ఈ మంగళవారం సెంట్రల్ టాటర్‌స్టాన్‌లోని ఓ భారీ చమురు కేంద్రం, డ్రోన్ల అసెంబ్లింగ్ యూనిట్లపై కీవ్ విరుచుకుపడింది. మరోవైపు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ నాటోతో సంబంధాలు బాగా దిగజారాయన్నారు. ఇవి ప్రత్యక్ష పోరు స్థాయికి చేరినట్లు అభివర్ణించారు. కొన్నాళ్ల నుంచి అమెరికా నేతృత్వంలోని ఈ సైనిక కూటమి ఇప్పటికే ఉక్రెయిన్‌తో యుద్ధంలో చేరిందన్నారు. ఇది రష్యా సరిహద్దుల్లోకి వస్తోందని వ్యాఖ్యానించారు.100 బిలియన్ యూరోలు ఉక్రెయిన్‌లో పెట్టుబడి పెట్టాలని నాటో సెక్రటరీ జనరల్ జేన్స్ స్టోల్టెన్‌బర్గ్ వ్యాఖ్యల నేపథ్యంలో పెస్కోవ్ ఈవిధంగా స్పందించారు. ఇప్పటికే నాటో సభ్య దేశమైన ఫ్రాన్స్ ప్రత్యక్షంగా బలగాలను ఉక్రెయిన్‌కు పంపేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది.



## మూడు పిల్లర్లు కూలితే ఏమైతది?

పంట పొలాలను పరిశీలించారు. అన్నదాతలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాజ్యంలో ఉన్నది అసమర్థులు, చవట దద్దమ్మలని విమర్శించారు. రైతుబంధు ఇవ్వకుండా రైతులను అగమాగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాలక్ష్మి లేదు.. మన్ను లక్ష్మి లేదు అంతా మోసమని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం తప్పిదాల వల్ల 209 మంది రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన రైతులకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇక నీ డ్రామాలు నడవవని హెచ్చరించారు. కేఆర్ఎంబీ అధికారులు ఏమైనా తమకు బాసులా అని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి నేనా.. నువ్వా.. నేను వెళ్లగానే..మోటార్లు ఆన్ చేశారు' అని చెప్పారు. రూ. 2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. డిసెంబర్ 9వ తేదీన మాఫీపై చేసిన సంతకం ఏమైందని నిలదీశారు. కరీంనగర్‌లో మేం జలధారలు సృష్టించి ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించామని.. ఇప్పుడు కేవలం నాలుగైదు నెలల్లోనే ఆ జలధారలు ఎందుకు ఎడారులుగా మారినయని కేసీఆర్ ప్రశ్నించారు.అంతకు ముందు ఆయన బాబుజగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. కాళేశ్వరం పూర్తయినందున ఈ జిల్లాలో ఇక నీళ్లకు డోకా ఉండదు, జిల్లాలో నాలుగు సజీవ జలధారలు అమృత ధారలుగా ఉంటయి, నిరంతరం ఈ జిల్లాను కాపాడుతయని చెప్పిన. ఆ సజీవ జలధారలను మేం సృష్టించినం. జిల్లా ప్రజలు వాటి ఫలితాలను అనుభవించింద్రు' అని కేసీఆర్ తెలిపారు.గోదావరి మీద నిర్మించిన బ్యారేజీలు, అసంపూర్తిగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తికావడం, ఎస్సారెస్పీకి నీళ్లు తక్కువైతే కాళేశ్వరం నుంచి నింపుకునే విధంగా పునరుజ్జీవం రావడంతో గోదావరి నది 200 కిలోమీటర్లపాటు నిండు జలాలతో ఉండేది. గత ఐదారేళ్లు ప్రజలు వాటిని ఎలా అనుభవించింద్రో యావత్ ప్రజానీకానికి తెలుసు' అని కేసీఆర్ అన్నారు. 'ఇన్ని జలధారలు సృష్టించి, నాలుగైదేండ్లు చక్కటి ఫలితాలు లభించి, లక్షల టన్నుల ధాన్యం పండించి, ఎంత కావాలంటే అంత తాగునీరు అనుభవించిన కరీంనగర్ ప్రజలు నాలుగైదు నెలల్లోనే ఏం జరుగుతున్నదో చూస్తున్నరు. ఈ జలధారలు ఎడారులుగా మారిపోయినయ్. నిండు జలాలతో కళకళలాడిన రాష్ట్రంలో ఎందుకు ఈ పరిస్థితులు వచ్చినయ్..? ప్రస్తుతం ప్రభుత్వం తెలివి తక్కువ, అసమర్థ, అవివేక, చవట విధానాలవల్ల, అర్భకత్వం వల్ల ఈ దరిద్రం వచ్చింది. 2014కు ముందు తెలంగాణలో ఏ గోస ఏ ఏడుపు ఏ బాధ, ఏ మంచి నీళ్ల ట్యాంకర్‌లు, ఏ బిందెల కొట్లాటలు, ఏ కాలిపోయిన మోటర్లు కనబడుతుండెనో ఇప్పుడు అదే పరిస్థితి కనబడుతున్నది' అని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో లత్కోర్‌లు రాజ్యం ఏలుతున్నారని ధ్వజమెత్తారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువేనని అన్నారు. 15 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై కేసీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఆయనను తన ప్రభుత్వంలో జైల్లో పెట్టాలనుకుంటే పెట్టేవాళ్లమని హెచ్చరించారు. మిడ్ మానేరు కట్ట కొట్టుకుపోవడానికి కోమటిరెడ్డి కంపెనీయే కారణం కాదా అని ప్రశ్నించారు. ఇవాళ ఆ మంత్రి అడ్డం పొడవు మాట్లాడుతున్నారని కేసీఆర్ విరుచుకుపడ్డారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కేసీఆర్ మండిపడ్డారు. రైతులు బ్యాంకులకు ఉరుకుంట్రి.. డిసెంబర్ 9 నాడు సంతకం చేస్తా.. 2 లక్షల రుణమాఫీ చేస్తా.. అని రేవంత్ రెడ్డి చెప్పిండు అని కేసీఆర్ గుర్తు చేశారు. ఆ హామీ ఎక్కడికిపోయిందని.. డిసెంబర్ 9న వెళ్లి ఎన్ని రోజులు అయ్యిందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతుందని.. ఇంకా దాని మీద ఊసే లేనట్టు ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు.మీ పాగల్ పని వల్ల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయమే సంక్షోభానికి గురయ్యే పరిస్థితి వచ్చిందని.. అయినా కూడా రైతు రుణమాఫీ మీద ఉలుకు పలుకు లేదని మండిపడ్డారు. వర్షాకాలం వడ్లు వస్తే దానికి బోనస్ ఇవ్వలేదు. క్వింటాల్‌కు 500 ఇస్తామని చెప్పి ఇయ్యలే. ఇవాళ కొనుగోలు కేంద్రాలు పెట్టినమని చెప్పింద్రు.. కానీ బోనస్ ఇస్తారా? లేదా? అనేదాని మీద ఉలుకులేదు.. పలుకు లేదు. ఇవ్వకపోతే మిమ్మల్ని వెంటాడుతాం అని హెచ్చరించారు. ఇదే రిఫరెండం అనుకుని ఓటేయమని మీరే చెప్పింద్రు కదా.. మీ సంగతేంటో ప్రజలు చూపిస్తారు. బోనస్ ఇవ్వకపోతే.. బోగస్ అని మీకు ఎలా బుద్ధి చెప్పాలో అలా బుద్ధి చెబుతారు. కర్రు కాల్చి వాత పెడతరు.' అని కేసీఆర్ హెచ్చరించారు. బోనస్‌కు ఎలక్షన్ కోడ్ అడ్డురాదని చెప్పారు. రైతులు ఉద్యమానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం కలిపి ఇస్తామని చెప్పింద్రు.. మార్కెట్‌లో ముఖ్యమంత్రికి, మంత్రులకు తులం బంగారం కొందామంటే దొరకట్లేదా? అని ప్రశ్నించారు. గొర్రెల యూనిట్లు ఇస్తారనే ఆశతో యాదవ సోదరులు వందల కోట్లు కట్టి ఉన్నారు.. కానీ గొర్రెల యూనిట్లు బంద్ చేసింద్రు. దానిపై మిమ్మల్ని శిక్షించేందుకు యాదవ సోదరులు రెడీగా ఉన్నారని కేసీఆర్ అన్నారు. ' మేం 1.30 లక్షల మందికి దళితబంధు మంజూరు చేశాం. మేం 10 లక్షలు ఇచ్చేవాళ్లం.. మీరు 12 లక్షలు ఇస్తామని అన్నారు. దాని మీద కూడా ఉలుకులేదు పలుకు లేదు. మేం రిలీజ్ చేసిన డబ్బు కూడా ఫ్రీజ్ చేశారు. అని పేర్కొన్నారు. ఇటువంటి మొద్దు నిద్రపోయే సర్కార్‌కు బరతలు పెట్టుకుని వాయించుడే కరెక్ట్ అని దళిత సోదరులకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారాలకు వచ్చే వీళ్లను నిలదీయాలని పిలుపునిచ్చారు. అన్న వస్త్రాం ఇస్తారని వెళ్తే.. ఉన్న వస్త్రం ఉడుచుకుపోయిందన్నట్టుగా రాష్ట్రంలో పరిస్థితి మారిందన్నారు. 12 లక్షలు ఇస్తారని మీకు ఓటేస్తే.. పాత 10 లక్షలు మంజూరు చేసుడు లేదు.. కొత్త దానిపై ఊసే లేదని మండిపడ్డారు. నేను సూర్యాపేట జిల్లాకు వెళ్తే. అక్కడ జిల్లాకు నీళ్లు కాల్వల్లోకి నీరు వచ్చాయి. తెల్లారే ఫోన్లు వచ్చాయి. మీ బస్‌పోంగనే నీళ్లు వాపస్ పోయినయని. సాగర్‌లో డెడ్‌స్టోరీ మీద 14 టీఎంసీలు ఉన్నయ్. ఎందుకు వాడుతలేరు ? మొత్తం కూలిపోయిందని చెప్పిన కాళేశ్వరం పంపులు ఆన్ చేసి వరద కాలువలోకి నీళ్లు వదులుతరు' అన్నారు. సిగ్గులేకుండా ముఖ్యమంత్రి మాట్లాడుతున్నడు. కేసీఆర్ గారు ముందే చెప్పచ్చుగదా నీళ్లు వదలాలని.. ముఖ్యమంత్రివి నువ్వా? నేనా? నీ ఇంజినీర్లు ఏం చేస్తున్నరు నీ డిపార్ట్‌మెంట్ ఏం చేస్తుంది.. . ఎందుకు వేల ఎకరాల్లో పంటలు ఎండపెట్టారు ? నాగార్జున సాగర్ కాలువ కొద్దిరోజుల ద్వారా కొద్దిరోజుల ముందు ఇచ్చి ఉంటే.. వేల ఎకరాలు ఒక తడికోసం ఎదురుచూసే పంట బతికేది. వరద కాలువ కింద కూడా 20 రోజుల కిందట వదిలి ఉంటే.. ప్రతి గ్రామంలో వందల ఎకరాల్లో పంట దక్కేది. ఈ పరిస్థితి సమయానికి నీళ్లు వదలక.. ఉన్న వనరులు, వసతులు తెలివితో వాడుకోక.. క్వాలిటీ కరెంటు అందించక.. రైతుబంధు సమయానికి ఇవ్వక.. ప్రజలను వెర్రితిర్రి మాటలతో ప్రజలను గందరగోళానికి గురి చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో వినోద్ కుమార్, గంగుల కమలాకర్, కెటిఆర్, దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ముఖ్యమంత్రి పర్యటను పట్టించుకోని గ్రామస్తులు , రైతులు**

**కరీంనగర్ బ్యూరో:** గతంలో మాదిరిగా, హంగులు, ఆర్భాటాలు, ప్రజానీరాజనాలకు దూరంగా మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు కరీంనగర్ పర్యటన ప్రారంభమైంది. కెసిఆర్ పొలం బాట కార్యక్రమానికి ప్రజానీకం నుండి స్పందన కరువైంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న నేత ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటనకు శ్రీకారం చుట్టారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధంపూర్ గ్రామంలో నిర్ణీత సమయానికి ఉదయం 10 గంటలకు మాజీ ముఖ్యమంత్రి పర్యటన ప్రారంభం కావాల్సి ఉండగా, మధ్యాహ్నం వరకు ఆయన గ్రామానికి చేరుకోలేదు. ఉద్యమ నేతగా, పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన చంద్రశేఖర రావు తమ గ్రామానికి విచ్చేస్తున్నప్పటికీ, గ్రామస్తుల నుండి పెద్దగా స్పందన కనిపించలేదు. మీడియా హడావిడి మినహాయించి, కనీసం వందమంది స్థానికులు కూడా కేసీఆర్ సందర్శించే పంట పొలాల వద్ద అగుపించకపోవడం, ఈ పర్యటనకు ప్రజాస్పదన లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది. తమ సమస్యలను పరిశీలించేందుకు మాజీ ముఖ్యమంత్రి గ్రామానికి వస్తున్నప్పటికీ, స్థానిక రైతుల నుండి పెద్దగా స్పందన లేదు. అధికారంలో ఉన్నన్ని నాళ్ళు ఆకాశమార్గంలో, ఆర్భాటంతో సాగిన కెసిఆర్ పర్యటనలతో పోలిస్తే, శుక్రవారం నాటి కరీంనగర్ పర్యటన పేలవంగా కొనసాగింది. ఇటీవల ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలలో కెసిఆర్ జరిపిన పొలం బాట కార్యక్రమానికి అంతో ఇంతో స్పందన కనిపించినా, ఉద్యమాల పురిటిగడ్డగా, తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావానికి వేదికగా నిలిచిన కరీంనగర్ లో మాజీ ముఖ్యమంత్రి పర్యటన ఇంత పేలవంగా జరగడం అధికారాంతమున.. నానుడిని గుర్తుకు తెప్పించింది. సాక్షాత్తు తమ పార్టీ అధినాయకుడు, రైతు సమస్యలను పరిశీలించేందుకు జిల్లా పర్యటనకు విచ్చేసినప్పటికీ, పార్టీ నేతలు జన సమీకరణ విషయంలో పెద్దగా దృష్టి సారించలేదు. ఓవైపు ఎన్నికల కోడ్ కారణంగా ముఖ్యమంత్రి పంట పొలాలు పరిశీలించే ప్రదేశంలో కనీస ఏర్పాట్లు చేయని పరిస్థితి. దీంతో వచ్చిన కొద్ది మంది సైతం మండుటెండల్లో ఆయన రాక కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓవైపు మాజీ ముఖ్యమంత్రి కరీంనగర్ పర్యటనపై అటు కాంగ్రెస్, ఇటు బిజెపి ఒకరోజు ముందే విమర్శనాస్త్రాలు సంధించాయి. పదేళ్ల అధికారంలో రైతుల సమస్యలు పట్టించుకోని ఆయన ఏ ముఖం పెట్టుకొని జిల్లాకు వస్తారని ప్రశ్నల వర్షం సంధించాయి. జిల్లా రైతులకు మొదట క్షమాపణ చెప్పి, ముక్కు భూమికి రాసి ఆ తర్వాత జిల్లాలో అడుగు పెట్టాలని ఆ రెండు పార్టీలు డిమాండ్ చేశాయి. లోక్‌సభ ఎన్నికల ముందు మాజీ ముఖ్యమంత్రి చేపట్టిన పొలం బాట బీఆర్ఎస్ కు అంతో ఇంతో మైలేజీ ఇస్తుందనుకుంటే, అటు జనం లేక, ఇటు రైతుల నుండి స్పందన లేక , కార్యక్రమం పరిసరాల్లో వేళ్లపై లెక్కించేంతమంది జనం లేక వెలవెల పోవడం ఆ పార్టీ వర్గాలు జీర్ణించుకోలేని పరిణామం. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వేలేరు మండల కేంద్రంలో దండ మోహన్ రెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్. పాల్గొన్న రెడ్డి సంఘం అధ్యక్షులు పిన్నింటి తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ దండ బుచ్చిరెడ్డి, ఇట్టబోయిన భరత్ కుమార్, శ్రీకాంత్, సతీష్ తదితరులు

# అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతర కృషితో పోరాటం చేసిన దళిత పోరాటయోధుడు బాబు జగ్జీవన్ రామ్:అన్నం ప్రవీణ్

**ఇల్లందకుంట ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థి ఉద్యమ నాయకులు, కాకతీయ యూనివర్సిటీ లా కళాశాల విద్యార్థి, కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ నాయకులు అన్నం ప్రవీణ్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకోవడం జరిగింది. కాకతీయ యూనివర్సిటీ లా కళాశాల విద్యార్థి అన్నం ప్రవీణ్ మాట్లాడుతూ.... బాబు జగ్జీవన్ రామ్ చిన్నతనం నుంచే అసమానతలు అవమానాలు ఎన్నో ఎదుర్కొని వాటికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన దళితరత్నం బాబు జగ్జీవన్ రావు గారు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం దళిత సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసి దళితులందరికీ విముక్తి కలిగించడానికి నిత్యం పోరాటం చేసిన దళిత మేధావి బాబు జగ్జీవన్ రామ్ గారు అని అన్నం ప్రవీణ్ తెలిపారు. 27 ఏళ్ల వయసులోనే ఒక ఎమ్మెల్యేగా చట్టసభల్లో అడుగుపెట్టి అంచలంచెలుగా ఎదుగుతూ అనేక పదవులు చేపట్టి ఎమ్మెల్యే నుంచి ఉప ప్రధానమంత్రి వరకు దేశానికి గొప్ప



సేవలందించిన చిరస్మరణీయుడు బాబు జగ్జీవన్ రామ్ గారిని అన్నం తెలిపారు. దాదాపు 50 సంవత్సరాలు పార్లమెంటేరియన్ గా పనిచేసి ప్రపంచ రికార్డు తన సొంతం చేసుకున్న గొప్ప నాయకుడు ఈ ప్రపంచంలో బాబు జగజీవన్ రావు గారికి ఆ గౌరవం దక్కిందని అన్నం ప్రవీణ్ కొనియాడారు అసమానతలు రూపుమాపడంలో సమన్యాయం కోసం జనమందరినీ చైతన్య పరుస్తూ అనేక సంస్కరణలు తీసుకొచ్చి సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ గారూ అయినటువంటి వారి ఆలోచనలు మేదోశక్తి ఇప్పటి విద్యార్థులు యువకులు ఆచరించి సమ సమాజ బాగు కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం దోహదపడాలని పాటుపడాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నం ప్రవీణ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెపు సారంగపాణి తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకులు అన్నం ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ది కుమార్ వంగ రామకృష్ణ మేకల సురేష్, రాజేశం, సంతోష్, రఘు బాబు, కుమార్, అజయ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డా. గున్న రాజేందర్ రెడ్డి



**హైదరాబాద్ ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తెలుగు రాష్ట్రాల గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ – గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి శుక్రవారం సీ.ఎం. నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. సుస్థిర అభివృద్ధి మార్గాన్ని ఎంచుకున్న సీ.ఎం. రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని వెళ్లేందుకు ప్రణాళికా బద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నారని రాజేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సుపరి పాలనను అందిస్తోందని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడం ద్వారా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాట నిలుపుకున్నారని డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఎంపీ స్థానాలను గెలుచుకోవడం ఖాయమని రాజేందర్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గాంధీ సిద్ధాంతాలు అమలు చేస్తూ.. గాంధీ చూపిన మార్గంలో పయనిస్తున్నారని రాజేందర్ రెడ్డి కొనియాడారు. ఈ భేటీలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, లోక కవి అందెశ్రీ కూడా ఉన్నారు.

# సికింద్రాబాద్ జిల్లా సిద్ధించాలని మహంకాళి అమ్మవారికి పూజలు

**సికింద్రాబాద్ ఏప్రిల్ 05 ( ప్రజామంటలు):** సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు కోసం జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే 7 అసెంబ్లీ నియోజకవర్గాలతో నూతన జిల్లా ఏర్పాటు కావాల్సిన అవసరం



సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన హర్యానా గవర్నర్ కేంద్రమంత్రి, ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు, ఎం.ఎల్.ఎ. లకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందని వివరించారు. తాము చేపట్టిన జిల్లా సాధన ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజల నుండి సానుకూల మద్దతు లభిస్తుందని చెప్పారు. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు అవుతుందనే పూర్తి విశ్వాసాన్ని

ఎంతైనా ఉందని అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. జిల్లా ఏర్పాటైన అనంతరం అమ్మవారికి 1116 కొబ్బరి కాయలు సమర్పిస్తామని అమ్మవారికి మొక్కుకున్నట్లు ఆయన చెప్పారు. జిల్లా ఏర్పాటు ఆవశ్యకత ను వివరిస్తూ ఆయన వ్యక్తం చేశారు. ఈ పూజలలో సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాల్ రాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, సభ్యులు కృష్ణ ముదిరాజ్, అశోక్, శ్రీకాంత్ రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

# బాబు జగ్జీవాన్ రామ్ జయంతి వేడుకలు

**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** ఇబ్రహింపట్నం గ్రామంలో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు మాదిగ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి యువకులు పూల



మాలలు వేసి, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ పెద్ద మనుసులు తిమ్మని రమేష్, కొత్తూరి నర్సయ్య, ఎంవైఎస్ యూత్ సభ్యులు, బంగారి దాస్, నల్లూరి సాగర్, గడుసంద రమేష్, తిమ్మని అరుణ్, కనక దినేష్, తిమ్మని మారుతి, బంగారి ప్రవీణ్, తిమ్మని అక్షయ్, కనక దిలీప్, తిమ్మని రాహుల్, తిమ్మని శ్రీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళ బృందం ద్వారా ప్రజలకు అవగాహన

**మల్యాల ఏప్రిల్ 5 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని నూకపల్లి గ్రామం లో పోలీస్ కళాబృందం వారు మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, సైబర్ మోసాలు,నివారణ పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమం భాగంగా మల్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి మాట్లాడుతూ ఈ మధ్యకాలం లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఎవరైనా మోసపోయినట్లైతే 1930 నంబర్ కి పిర్యాదు చేయాలని,పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు, సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్థులను కోరారు.తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు.యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని,ప్రభుత్వం ,పోలీస్ తరపున అన్ని విధాల సహాయహకారులు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్న పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. గ్రామంలో చిన్న చిన్న తగాదాలకు పోయి జీవితం నాశనము చేసుకొవద్దని, నేరరహిత గ్రామాలుగ చేయడానికి ప్రజలు కృషి చేయాలనీ సూచించారు. మంత్రాలు తత్రాలు ముడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమ్యస వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలన్నారు,లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రవి , ఎస్ఐ కుమార స్వామి





మరియు గ్రామ ఎంపీటీసీ,మాజీ సర్పంచ్, పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి

**గొల్లపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** గొల్లపెల్లి మండలం కేంద్రం లో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సాపురం రవీందర్ ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షులు చెవులమద్ది మల్లేష్ గొల్లపెల్లి పట్టణ అధ్యక్షులు గంగాధర మధుసూదన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత జన బాంధవుడు సమతావాది, సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధానిడా. బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండ్ర తిరుపతి, గొల్లపెల్లి పట్టణ కార్యదర్శి దసరాపు సదానందం, రాపల్లి గ్రామ శాఖ గడుగు విజయ్, చెవులమద్ది గంగాధర్, అగ్గిమల్ల గ్రామ శాఖ అధ్యక్షులు చలిగంటి శ్రీధర్, గంగాధర సునిల్ ఎం.డి. నజీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా కార్యాలయంలో జయంతి వేడుకల్లో భాగంగా వారి చిత్రపటానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జ్ డా. బోగ శ్రావణి. జగిత్యాల జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు, వివిధ మోర్చాల అధ్యక్షులు జిల్లా మండల పదాధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# మండల వ్యాప్తంగా ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**భీమదేవరపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** మాజీ ఉప ప్రధాని, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన సామాజిక విప్లవ యోధుడు బాబు జగ్జీవన్ రామ్ 116 వ, జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నాయకులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద...
మాజీ అంబేద్కర్ సంఘం ఉత్సవ కమిటీ చైర్మన్ మాడుగుల అశోక్ ఆధ్వర్యంలో జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్ హాజరైనారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మండల సురేందర్, సంగ సంపత్, మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, మేకల లాజరస్, శనిగరం సదానందం, బొల్లంపల్లి సుకుమార్, గుడికద్దుల పూర్ణచందర్, కండే చిరంజీవి, మాడుగుల రమేష్, మాడుగుల గోపి, ముజ్జిక సంపత్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


భీమదేవరపల్లి క్రాస్ రోడ్ వద్ద ...
అంబేద్కర్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సభాధ్యక్షులు, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ కమిటీ చైర్మన్ కరుణాకర్ ఆధ్వర్యంలో ముఖ్య అతిధులుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిట్టెంపల్లి అయిలయ్య, మాజీ ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు కొలుగూరి రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యుఐ హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు గజ్జల రమేష్, వరంగల్ నగర అంబేద్కర్ సంఘం



అధ్యక్షులు తూముల సదానందం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డబ్బా శంకర్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు సాగంటి వెంకటేశ్వర్లు, ఎలకపల్లి శ్రీనివాస్, సాతూరి చంటి, పచ్చునూరి సురేష్, సాతూరి చిరంజీవి, ఎర్ర రాజేష్, సాతురి సదానందం తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యాపూర్, గాంధీనగర్ గ్రామాలలో.....
బాబు జగ్జీవన్ రావు జయంతి ఉత్సవాలు గాంధీనగర్ మాణిక్యాపూర్ గ్రామాలలో గ్రామశాఖ అధ్యక్షులు తాళ్లపల్లి ఐలయ్య, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సాగర్, ఉపాధ్యక్షులు తాళ్లపల్లి అశోక్, సలహాదారులు తాళ్లపల్లి జగన్, సిగ కొమురయ్య, తాళ్లపల్లి రాజయ్య, ఆశీర్వాదం, కుమార్ మాడుగుల స్వామి, తాళ్లపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ మాట్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో.... బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద %అ%జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి మధుకర్, కండె సుధాకర్, తాడూరు చిరంజీవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




# లడాక్ ప్రజా ఉద్యమం నుండి ప్రజల దృష్టి మారాల్చడానికే బిజేపి యత్నం

## కచ్చతీవు రచ్చ ఎన్నికల కోసమేనా? మనం ఎందుకు బంగ్లాదేశ్ కు ఎక్కువ భూబయగం ఇచ్చాం ?

సిహెచ్ వి ప్రభాకర్ రావు,
సీనియర్ జర్నలిస్ట్. 9391533339

రాజకీయాలలో ఎదుటివారికి ప్రాధాన్యత దక్కకుండా, వారి విమర్శలను తొక్కిపట్టే విధంగా కొత్త కథనాలను, ప్రతివిమర్శలను ముందుకు తేవడంలో బిజేపి ని మించిన చాణక్య ఎత్తుగడలు మరేవరి దగ్గర లేవనడంలో అతిశయోక్తి లేదేమో? లడాక్ లో పర్యావరణ ప్రేమికుడు, అక్కడి ప్రజల బాగోగుల కొరకు ఎన్నాళ్లుగానో శ్రమిస్తున్న సోనమ్ వాంగ్ చుక్ గత నెల రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షను లెక్కచేయకుండా, ఆయన లేవనెత్తిన అంశాలను పట్టించుకోకుండా, బిజేపి ఇప్పుడు కొత్తగా ఎన్నికల సమయంలో, శ్రీలంక– భారతదేశం లో మధ్య ఎప్పుడో 40 ఏళ్ల క్రితం, 1974 లో జరిగిన కచ్చతీవు ఒడంబడిక గురించి రచ్చ రేపుతుంది.

ప్రధాని నరేంద్ర మోడి బంగ్లాదేశ్ తో కుదుర్చుకొన్న భూమార్పిడి ఒప్పందంలో మనం నష్టపోయిన ప్రాంతం గురించి ఎందుకు మాట్లాడారు. మనకు బంగ్లా దేశ నుండి వచ్చిన భూబయగం కంటే ఎక్కువ భూబయగం మనం ఎందుకు వదులుకున్నామో ఎప్పుడైనా చెప్పారా? అరుణాచల్ ప్రాంతంలో చైనా తిష్ట వేసి వందల ఏకరాల భారత భూబయగంలో కొత్త జనవాసలను నిర్మిస్తుంటే ప్రశ్నించని వారు ఎప్పుడో జరిగిన ఒప్పందాలను ప్రశ్నించడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇదంతా దక్షిణాన, ముఖ్యంగా తమిళనాట జరుగుతున్న ఎన్నికల్లో లబ్ది పొందాదానికే అనే విషయం స్పష్టం అవుతుంది. కచ్చతీవు ను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీలంకకు అప్పచెపితే, పదేళ్ళ పాలనలో బిజేపి ఎందుకు తిరిగి సీసుకోవడానికి ప్రయత్నంచలేదనే ప్రశ్నకు జవాబు లేదు. అలాగే లడాక్ లో, గత ఎన్నికల్లో బిజేపి వాగ్దానం చేసినట్లు ఆప్రాంతాన్ని 6 వ షెడ్యూల్ లో చేర్చి, రాష్ట్రంగా మార్చి ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న అక్కడి ప్రజల కోరికలను, ఉద్యమాలను ప్రపంచానికి తెలియకుండా అడ్డుకొంటున్న మీడియా పై ఎందుకు బిజేపి నాయకత్వం ప్రశ్నించడం లేదు. లడక్ ఉద్యమ నాయకులు ప్రత్యక్షంగా చూస్తూ, అక్కడి పరిస్థితిని అవగాహన చేసుకొంటూ, గతంలో తమ ప్రజలు తిరిగిన దాదాపు 4000 వల చదరపు కి. మి. భూబయగాన్ని చైనా ఆక్రమించిందని చెపుతున్న మాటలకు ఎందుకు బిజేపి నాయకత్వం జవాబివ్వడం లేదో అందరికీ తెలుసు.

కచ్చతీవు అనే దాదాపు 250 హెక్టారాల విస్తీర్ణం గల చిన్న, దీవి రామేశ్వరం నుండి 333 కి. మి. దూరంలో, శ్రీలంక లోని నేడుంతీవి (డేల్ఫ్ ఐలాండ్) నుండి 24 కి. మి. దూరంలో ఉంటుంది. ఈ దీవి జనావాసలకు అనుకూలంగా ఉండకపోవడం తో ఎవరు ఈ దీవిని అంతగా అపట్టించుకోలేదు. కానీ మత్స్యసంపదకు నెలవైన ఈ ప్రాంతంలో ఎప్పుడు భారతదేశ–శ్రీలంక మత్స్యకారుల మధ్య గొడవలు జరడంతో, అప్పటి ఇందిరా గాంధీ–సిరిమావో భాండారనాయకే ప్రభుత్వాలు ఒక ఒడంబడిక కుదుర్చుకొని, కచ్చతీవిని శ్రీలంకకు అప్పచెప్పారు. ఆసమయంలో అక్కడ ఇతర ఖనిజ సంపద, చములు నిక్షేపాలు ఉన్నాయనే విషయం తెలుసుకొని, ఏఎ సమస్యను ఎంత తొందరగా ముగించుకొంటే అంతా మంచిదని, చమురు నిక్షేపల విషయం శ్రీలంక కు తెలియడానే విషయాన్ని అప్పటి విదేశాంగ శాఖ కార్యదర్శి కేవల సింగ్– తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి ల మధ్య జరిగిన లేఖలలో స్పష్టంగా పేర్కొన్నారు.

**కన్యాకుమారి ప్రాంతంలోని చమురు నిక్షేపాలు స్వంతం :** కచ్చతీవు ఇవ్వడం వల్ల అక్కడి కన్యాకుమారి దగ్గరి దాదాపు 4000 కి. మీ. విస్తీర్ణంలోని తీరప్రాంతం అంతా భారతదేశ సార్వభౌమాధఏకరం గల ఈఈజెడ్ (ప్రత్యేక ఆర్థిక మండలి)గా శ్రీలంక గుర్తించింది. మనం ఇచ్చింది 280 ఎకరాల (1.6 కి. మీ పొడవు %--% 300 మీ వెడల్పు) దీవి. ఇది ఉన్న ప్రాంతంలో మత్స్యకారుల మధ్య గోడవలే కాకుండా, స్మగ్లింగ్, మత్తుపదార్థాల రవాణా, చైనా, పాకిస్తాన్ లాంటి దేశాల ఉనికికి నెలవుగా కాకూడదనే అప్పటి ప్రభుత్వాలు ఏఎ ఒప్పందాన్ని చేసుకొన్నట్లు చరిత్ర చెపుతుంది. ఏఎ దీవి ఇవ్వడం వల్ల మనకు 4000 చదరపు కి. మి ల విస్తీర్ణంలో భారతదేశానికి ఈఈజెడ్ ప్రతిపత్తిని శ్రీ లంక ఒప్పుకొందనే వశయాన్ని మరచిపోకూడదు.

**లేకుంటే కచ్ లోని మరో “సర్ క్రీక్” లా మారేది ?**

కచ్చతీవు సమస్య బిజేపి కి తమిళనాడులో ఓట్లు దండుకోవడానికి ఒక ఆయుధంగా వాడుకొంటుందని తమిళ పార్టీలు భావిస్తున్నాయి. తమిళనాట కాంగ్రెస్–ది ఎం కె కూతమిని దెబ్బతీయడానికి అక్కడి ప్రజలలో విద్వేషాలు రెపడానికి ఏదోక ఆయుధంగా మారుచుకోంటుంది. దక్షిణాన ఉనికి లేని బిజేపి రాజేకీయంగా నిలదొక్కుకొని, ఏదో సాధించాలనుకోవడంలో తప్పు లేదు. కానీ మానిన గాయాలను రేపి, రెండు దేశాల ప్రజలలో ద్వేషం పెంచడానికి చేసే ప్రయత్నాలే సరికాదని తమిళ ప్రజలు భావిస్తున్నారు.

శ్రీలంక ప్రభుత్వం ఏఎ విమర్శలపై స్పందిస్తూ, ఇదొక ముగిసిన అంశామని, దీనిపై ఇప్పుడు చర్చించడం అనవసరమని ప్రకటించింది. అప్పుడు ఏఎ సమస్యను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోకుంటే, శ్రీలంక అంతర్జాతీయ కోర్టులు దావా వేస్తే, ఏఎ సమస్య కాశ్మీరీ సమస్యల అయిప్పటికి తేలేది కాదు. ఈ ప్రాంతం రెండు దేశాల మత్స్యకారుల మధ్య రావనకాష్టమలా ఘర్షణలతో మరిన్ని కొత్త సమస్యలకు దారితీసేదని అప్పటి దౌత్యవేత్తలు అంటున్నారు. ఇప్పటికీ గుజరాత్ లోని కచ్ ప్రాంతం లోని “సర్ క్రీక్” సమస్యతో అక్కడి భారతీయ మత్స్యకారులు పాకిస్తాన్ జైళ్ళలో మగ్గుతున్న విషయం మారిచిపోకూడదు.

## ఓటే వజ్రాయుధం!



ఏలాలనుకొనే వారికి వొద్దికైన వాలుకుర్చీ
అయ్యేదీ..
పైకెక్కేందుకు వంగిన కింది మెట్టయ్యేదీ..
ఎన్నికలయ్యేక ధరాఘాతాలు తగిలి
అంపశయ్యెక్కే అభినవ భీష్ముదయ్యేదీ..
అన్నీ అతడే..
ఓటరు మహాశయుడే!
అవినీతి రాజ్యమేలుతున్నా అభివృద్ధి
ఎండమావేనని తెల్సినా మనకెందుకనుకొని
ఓటేసి చేతులు దులుపుకొని మౌనంగా
సాగిపోతాడుజి
అలాంటి వాళ్ళే కదా మన ప్రజాస్వామ్యానికి
పునాదిరాళ్ళు!
నాయకులు పూటకో పార్టీ మారుతున్నా
పదవుల కోసం పచ్చిగా కొట్టుకొంటున్నా
తలొంచుకొని వినయంగా పోయే మనలాంటి
భయస్తులే నాయకాగ్రేసులకు నమ్మకస్తులు!
మన చేతగానితనమో తెలివితక్కువతనమో..
దాన్ని నమ్ముకునే అదిగదిగో గణతంత్రంలో
ప్రచారరథాలు నలుదిశలా హోరెత్తుతున్నాయి..
పరస్పర విమర్శల ప్రయోజనాలు శూన్యమనీ
వరాలకు వాస్తవాలకు దూరాలు ఎంతో భారాలనీ
నగ్నసత్యాలు తెల్సుకొని ఉచితానుచితాలు
మర్చిన ఉచితాలు మర్చిపోయి..
ఓటుతో పీఠం కదిలించే తమ శక్తిని గ్రహించే
చైతన్యవంతులైతే
ప్రజాస్వామ్యంలో కాగలకార్యం దానంతటదే
తప్పక నెరవేరుతుంది..!

–భీమవరపు పురుషోత్తమ్
9949800253





## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

## కోడలి పొదుపు

గుంటూరులో నివాసం ఉండే రంగనాధం తనకుమారుడికి వివాహం చేయదలచాడు. మంచి సంబంధాలలు వెదకగా జాగర్లమూడి లోని రాఘవయ్య గారి కుమార్తె కన్యక, సిరిపురం లోని పరంధామయ్య గారి కుమార్తె రాధిక అనే ఇరువురు రంగనాధానికి బాగానచ్చారు. కాని ఆఇద్దరి లో ఎవరిని ఎంపిక చేసుకొవాలో తెలియక తన మిత్రుడు చంద్రయ్యను సహాయం చేయమన్నాడు. దానికి ఏంచేయాలో వివరించాడు చంద్రయ్య.

ముందుగా కబురు పంపిన విధంగా రాఘవయ్య గారి ఇంటికి భోజనానికి వెళుతూ , బుట్టనిండుగా పలు రకాల పండ్లు తీసుకువెళ్ళారు. భోజనంలో అన్ని రకాల కాయకూరలు వేసిన పప్పుచారు, దోసకాయ రోటి పచ్చడి, పెరుగు, వడియాలు,అప్పడం ఊరగాయ వడ్డించారు. భోజనం చేస్తున్న చంద్రయ్య “ అమ్మా కన్యక! వడ, పాయసం అంటే సరి చేయలేదు. ఇంటి ముందర అన్ని కోళ్ళు తిరుగుతున్నాయి ఒకదాన్ని కోసి కూర వండవచ్చు



కదా! “ అన్నాడు.

సాధారణ వస్త్రధారణలో ఉన్నకన్యక “ మామయ్య గారు ఒక కోడిని కోసుకుని వండుకు తింటే ఆపూట సంతోష పడతాం. అదేకోడి రోజు ఒక గుడ్డు పెడుతుంటే ప్రతిదినం మనకు ఐదు రూపాయల ఆదాయం లభిస్తుంది. అంటే మనకోడి మనకళ్ళ ముందే ఉంటు అది రోజు ఐదు రూపాయలు మనకు ఇస్తుంటే ఆసంతోషం వేరు. కోళ్ళపైనే కాకుండా పెరడులోని కూరగాయలపైన, ఇంటి పాడి పసువుల పాలవ్యాపారం పైనా రాబడివస్తుంది. సమయం,సందర్భం ,అవకాశం ఉన్నప్పుడు ధనం సంపాదించాలి మన అవసరాలకు పొదుపుగా వాడుకోవాలి,రేపటి అవసరాలకు ధనం దాచుకోవాలి “ అన్నది . కన్యక మాటలకు నవ్వుకున్నాడు చంద్రయ్య.

మరుదినం పరంధామయ్య గారి ఇంటికి పళ్ళ బుట్టలు తీసుకుని భోజనానికి వెళ్ళారు రంగనాథం,చంద్రయ్యలు. భోజనంలో వడ, పాయసం, కోడి,మేక కూరతోపాటు, పలురకాల కాయకూరల వంటకాలు వడ్డించబడ్డాయి. “ చాలా పదార్థాలు వడ్డించారే “ అన్నాడు చంద్రయ్య.

“ మాస్థాయికి తగిన భోజనం మామయ్య గారు “ అన్నది రాధిక ఖరీదైన దుస్తుల్లో మెరిసిపోతూ .మౌనంగా భోజనం ముగించిన మిత్రులు తమఊరికి ప్రయాణమైయ్యారు. దారిలో చంద్రయ్య... “ రంగనాథం పరంధామయ్య, రాఘవయ్య ఇద్దరు మధ్యతరగతి కుటింబీకులే! లేని ఆధిక్యత చూపించబోయింది రాధిక. ఉన్నంతలోనే పొదుపుగా జీవించాలి ఆడంబరాలు,డాంబికాలు వద్దు జీవించడానికే ఆహారం,ఆహారం కొరకు జీవించకూడదు అనే సందేశాన్ని ఇచ్చింది రాఘవయ్య కుమార్తె కన్యక. తెలివి,అందం బుద్ధిమంతురాలైన కన్యక నీఇంటి కోడలుగా ఉండే అర్హతలన్ని ఉన్నాయి “అన్నాడు చంద్రయ్య. “నువ్వు చెప్పింది నిజమే రేపటి గురించి నేడు ఆలోచన చేయడం మంచిలక్షణం. ఉన్నంతలో పొదుపుగా జీవించాలి అనుకున్న కన్యక మాయింటికి తగిన కోడలు “ అన్నాడు రంగనాధం.

**బెల్లంకొండ నాగేశ్వరరావు. చెన్నై**


## కవులకు గమనిక

ప్రజా మంటలు

ఇవి ఎన్ని"కల" రోజులు.
కవులు సమాజాన్ని కదిలించాలి. అందుకే,
ప్రజలను చైతన్యవంతం చేసే కవితలను
ఆహ్వానిస్తున్నాం.
మీ కవితలు ఎన్నికల అంశానికే పరిమితమై
సామాజిక అంశాలాను స్పృశిస్తూ,
10-15 లైన్లకు మించకుండా
ఈ కింది ఈమైల్ కు పంపండి.
mantalukathalu@gmail.com
వీటిని ప్రతిరోజు "ప్రజా మంటలు"
తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రచురిస్తాం.
-ఎడిటర్

# బాబు జగ్జీవన్ రామ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**జగిత్యాల ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** పూజ్య బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 117వ జన్మదిన వేడుకలను కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చేసిన సేవలు భావి తరాల వారికి ఉపయోగపడుతున్నా యని తెలిపారు. ఆయన సమాజం కోసం, అన్నీ వర్గాల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని అన్నారు. 40 సంవత్సరాలు రాజకీయ సేవలు అందించారని, 1965 లో గ్రీన్ రెవల్యూషన్ ప్రారంభించారని తెలిపారు. 1971 లో ఇండియా పాకిస్తాన్ యుద్ధ సమయంలో ఆయన రక్షణ మంత్రిగా పనిచేశారని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో ముఖ్య పాత్రను పోషించారని తెలిపారు. అస్పృశ్యత నివారణకై పోరాటం చేశారని తెలిపారు. నిజమైన అర్హత కలిగిన వారికి సహకారం అందించాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.ఎస్.దివాకర మాట్లాడుతూ, జగ్జీవన్ రామ్ చరిత్ర ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. న్యాయం, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. అదనపు కలెక్టర్ పి. రాంబాబు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బీహార్ లో జన్మించారని, మూడ నమ్మకాలను రూపుమాపాడారని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని అన్నారు. అదనపు ఎస్పీ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఆయన సేవలు శ్లాఘనీయమని అన్నారు. ఆయన స్ఫూర్తి తోనే పోలీసు ఉద్యోగం చేస్తున్నానని తెలిపారు. జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్ వందన సమర్పణ చేశారు. అంతకు ముందు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# సర్ సి.వి. రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్ లో జ్యోతి విద్యార్థుల ప్రతిభ









**జగిత్యాల ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటీ అకాడమీ కి చెందిన విద్యార్థులు సుచిర్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ సివి రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్ లో ప్రతిభ చాటారు. ఏ. రాధాకృష్ణ 10వ తరగతి డిస్టిక్ ఫస్ట్ ర్యాంక్, ఎస్. రిషికేష్ డిస్టిక్ ఫస్ట్ ర్యాంక్, శ్రీపాద వల్లభ డిస్ట్రిక్ట్ సెకండ్ ర్యాంక్ కైవసం చేసుకున్నారు. ఏప్రిల్ 4, 2024 హైదరాబాదులోనీ శ్రీ సత్య సాయి నిగమగామం శ్రీనగర్ కాలనీ, పంజాగుట్టలో జరిగిన సూచిర్ ఇండియా 31 వ సివి రామన్ అవార్డ్స్ లో శ్రీ చంద్రబోస్ (ఆస్కార్ అవార్డు విన్నర్ మరియు సింగర్) జి. సతీష్ రెడ్డి (ఛైర్మన్ డిఆర్డిఓ) చేతుల మీదుగా అవార్డ్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియ్యల హరి చరణ్ రావు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు హరిచరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనికరావు, అజిత ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# బెల్ట్ షాపుపై టాస్క్ ఫోర్స్, పోలీస్ అధికారుల దాడి

**వేలేరు ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** వేలేరు మండలం పీచర గ్రామంలోని గురువారం రోజు రాత్రి బెల్ట్ షాపుపై దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు వేలేర్ పోలీసులు గ్రామానికి చెందినా బొల్లి రాజు వద్ద నుండి 50 వేల విలువ గల మద్యం సీజ్ చేయడం జరిగిందని వేలేరు ఎస్సై హరిత తెలిపారు.

# పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

## సీపీఐ లో పలు పార్టీల నుండి చేరికలు



**వేలేరు ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** వేలేరు మండల కేంద్రంలో పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, ఎర్రజెండా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. వేలేరు మండలంలో 20 మంది వివిధ పార్టీల కార్యకర్తలు శుక్రవారం సీపీఐలో చేరగా వారికి సీపీఐ నాయకులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేలేరు మండలం లోని రెడ్డి సంక్షేమ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదల తరుపున వారి సమస్యల పై పోరాడేది కమ్యూనిస్టులే నని అన్నారు. బూర్జువా పార్టీలకు ఎన్నికలపుడే ప్రజలు గుర్తుకు వస్తారని, కానీ ఎర్రజెండా పార్టీలు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటాయని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిరుపేదలకు సాగు భూమి, ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం వేలాది మందిని సమీకరించి భూపోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ దేనని అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థినే గెలిపించకునేందుకు సీపీఐ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల యెల్లేష్, జిల్లా నాయకులు, మునిగాల భిక్షపతి, మేకల శంకర్. మాతంగి యాదమ్మ, ఏలూరు సబిత, ధార రాజు, ఏలూరు లక్ష్మి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల అభ్యుదయానికి కృషి చేసిన దళితోద్ధారకుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి




**గుంతకల్ ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** అణగారిన వర్గాల అభ్యుదయానికి కృషి చేసిన దళితోద్ధారకుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా గుంతకల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో గుంతకల్ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనగుంది విజయలక్ష్మి, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుర్రం సూర్యనారాయణ, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిఎం మహేష్ బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కొలిమి రామాంజనేయులు, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి వాసం రవిబాబు, యువ మోర్చా నాయకుడు కేశవ్ , ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అంబులెన్స్ ను ఆకస్మిక తనిఖీ చేసిన అధికారులు

## పరికరాల పనితీరు, రికార్డుల పరిశీలన



**భీమదేవరపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన 108 అంబులెన్స్ వాహనాన్ని శుక్రవారం హనుమకొండ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ ఎం. లక్ష్మణ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అత్యవసర సమయంలో వినియోగించే వైద్య పరికరాల పనితీరు, ఇంజక్షన్స్, మందులు, సంబంధిత రికార్డులు పరిశీలించారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అందించే వైద్య సేవలు, రోడ్ యాక్సిడెంట్లు, పాముకాటు, గర్భిణీ స్త్రీలు అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ ను ప్రజలు వినియోగించు కోవాలని అన్నారు. వీరి వెంట ఈఎంటి మేకల రవి, పైలెట్ బి. పవన్ తదితరులు ఉన్నారు.

# రికార్డ్ అసిస్టెంట్ గా ప్రభాకర్ జోంద్లే సేవలు ప్రశంసనీయం

## వంగర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సురేఖ



**భీమదేవరపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** మండలంలోని వంగర డాక్టర్ పివి రంగారావు టి.ఎస్.ఆర్.ఎస్. లో రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తూ, పదవి విరమణ పొందిన ప్రభాకర్ జోంద్లే సేవలు ప్రశంసనీయమని పాఠశాల ప్రిన్సిపల్ సురేఖ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ%ొా%. ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమని పేర్కొన్నారు. విధులను క్రమశిక్షణతో నిర్వహించి అందరి మన్ననలు పొందారన్నారు. తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. పదవి విరమణ పొందుతున్నందుకు బాధగా ఉన్న శేష జీవితం ఆనందంతో గడపాలని ఆకాంక్షించారు. పాఠశాల ఆధ్వర్యంలో ప్రభాకర్ జోంద్లే దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అఫ్రీన్, భార్గవి, అముక్త, పిఈటి నిర్మల, కుమారస్వామి, రాకేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయం ముందు బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్ష

**జగిత్యాల ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా శాఖ పిలుపుమేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఆఫీస్ ముందు రైతు సత్యాగ్రహ దీక్ష కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తో కలిసి పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పడాల తిరుపతి,రైతు నాయకులు పన్నుల తిరుపతి రెడ్డి, బీర్పూర్ మండల జడ్పిటిసి పాత పద్మా రమేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ, యాదగిరి బాబు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొక్కు గంగాధర్, పట్టణ మరియు మండల అధ్యక్షులు మండల మరియు జిల్లా పదాధికారులు ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.









# ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి- పాల్గొన్న చీఫ్ విప్ అడ్లూరి

**జగిత్యాల ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిజామాబాద్ పార్లమెంట్ ఎంపిగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని గెలిపించాలని, ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీ పైన బురద జల్లే ప్రయత్నం చేయడం జరుగుతుందని, అవాస్తవాలని ప్రచారం చేస్తూ ప్రజలను తప్పు దోవ పట్టించడం జరుగుతుందని, దాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని, గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న కెసిఆర్ అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతు ఖాతాలో ప్రభుత్వ సాయాన్ని జమ చేస్తమని చెప్పి ఒక్కరి ఖాతాలో డబ్బులు జమ చెయ్యలేదని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతుల గురించి ఏనాడు పట్టించుకోలేదని, జగిత్యాల జిల్లా పర్యటనకి వచ్చిన ప్రధాని మోడీ జిల్లా రైతాంగానికి ఏమి చేస్తారో ఒక స్పష్టత ఇవ్వలేదని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, జీవన్ రెడ్డి నిరంతరం పేదల పక్షాన నిలబడి పోరాటం చేసే వ్యక్తి అని,ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జీవన్ రెడ్డి ని నిజామాబాద్ ఎంపీ గా గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అండగా నిలువండి, అభివృద్ధి చేస్తా



## బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్

**మెట్టుపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** నాటి నుండి నేటి వరకు బడుగు బలహీన వర్గాల ప్రజలకి బాబూ జగ్జీవన్ రామ్ ఒక ఆశాజ్యోతిగా నిలిచారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి, తునికి వేణు గోపాల్ లు అన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా మెట్ పల్లి కోర్టు లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఫోటోకి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనాటి పేద ప్రజలకి, సమాజానికి కూడా బాబూ జగ్జీవన్ చేసిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎలుముల రాంబాబు సీనియర్ న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, వడ్డేపల్లి శ్రీనివాస్, దయ్యా రాజారాం, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒజ్జెల శ్రీనివాస్, న్యాయవాదులు బక్కురి రమేష్, మగ్గిడి హరిభూషన్, మన్నె గంగాధర్, మగ్గిడి నర్సయ్య, బత్తుల దీక్షిత్, ఇల్లేందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా కేంద్ర బలగాలతో వేలేరు మండలం పీచర, వేలేరు గ్రామాలలో కవాతు నిర్వహించిన ఎస్.ఐ. హరిత, సి.ఐ మహేందర్. పాల్గొన్న సిఆర్ పిఎఫ్ బలగాలు

## కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యం

### కాంగ్రెస్లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, యువకులు

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

### జీవన్ రెడ్డి కి హనుమాన్ దీక్షాపరుల మద్దతు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి–పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ రూరల్ మండలాధ్యక్షుడు జున్ను రాజేందర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన 100మంది నాయకులు, యువకులు చెట్పల్లి సత్తయ్య, చెట్పల్లి గంగారెడ్డి, పాలెపు గంగన్న, సిరిపురపు రాకేశ్, ఎండీ. రఫీ, కోల రాజన్న, నారాయణ, వేల్పు రాములు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీవన్రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జీవన్రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా చల్గల్ గ్రామంతో విడదీయరాని అనుబంధం ఉంది. గ్రామీణ ప్రజలకు సేవల చేయడంలో తృప్తి ఉంది. ఉచిత విద్యుత్ అందిస్తూ, పండించిన పంటకు మద్దతు కల్పించడంలో రైతులకు అండగా నిలిచానని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో చల్గల్లో 25 ఎకరాలు కేటాయించి, మామిడి మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు. స్థానికంగా ఉపాధి కల్పించామన్నారు. చల్గగల్ గ్రామ అభివృద్ధికి ఆది నుండి కృషి చేస్తున్నాని, ఇటీవల ముదగంపల్లి నుండి చెర్లపల్లి కి సీసీ రోడ్డు వేయించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రారంభించిన చక్కర కర్మాగారం గత ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేశారు. వరికి ప్రత్యామ్నయంగా రైతులకు అండగా నిలిచేందుకు చక్కర కర్మాగారం పునఃరుద్దరిస్తామన్నారు. స్థానికంగా ఉపాధి కరువై, గల్ఫ్ బాట పడుతున్నారని, వారి సంక్షేమం కోసం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని జీవన్రెడ్డి హామీ ఇచ్చారు. అకాల మరణం చెందిన కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రూ. 5 లక్షల సాయం అందించడంతోపాటు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. బీడీ కార్మికులకు అండగా నిలిచేందుకు బీడీ కార్మికులందరికి పెన్షన్ అందిస్తామన్నారు. గత ప్రభుత్వం బీడీ కార్మికులకు పీఎఫ్ 2014 కట్ ఆఫ్ తేదితో బీడీ కార్మికులకు పెన్షన్ రావడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కట్అఫ్ తేది తొలగించి, బీడీలు చేసే ప్రతి కార్మికురాలికి రూ. 4000 పెన్షన్ అందిస్తామన్నారు. ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో తనకు రాజకీయాలకు అతీతంగా అండగా నిలువాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేసేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. జీవన్రెడ్డికి హనుమాన్ దీక్షాపరుల మద్దతు. హనుమాన్ దీక్షాపరులు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్రెడ్డిని కలిసి, మద్దతు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో హనుమాన్ భక్తుడు జీవన్రెడ్డి వెంట ఉంటామని భరోసానిచ్చారు. ఊరూరా హనుమాన్ ఆలయాలను నిర్మించిన నిఖార్సైన హనుమాన్ భక్తుడు జీవన్ రెడ్డి అని కొనియాడారు. హనుమాన్ దీక్షాపరులు మద్దతు తెలుపడంపై జీవన్రెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకొని, నాలుగు దశాబ్దాలుగా ధర్మనిష్టతో ప్రజలకు సేవలందిస్తున్నానని జీవన్రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో అండగా నిలువాలని జీవన్ రెడ్డి హనుమాన్ దీక్షాపరులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, ఎంపీపీ మహేశ్, పాక్స్ వైస్ చైర్మన్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండగ సర్వ మానవ సౌభాతృత్వానికి ప్రతీక

### జువ్వాడి కృష్ణారావు



**మెట్ పల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** పవిత్ర రంజాన్ పండగ సర్వ మానవ సౌభాతృత్వానికి ప్రతీక అని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు ఈరోజు మెట్పల్లి మండలం వేంపేట గ్రామంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.... ముస్లిం సోదరులు ఎంతో నియమనిష్టలతో రంజాన్ ఉపవాసాలు ఉంటారని ఆధ్యాత్మికంగా పవిత్రమైన కార్యక్రమమని అన్నారు ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి కృష్ణారావు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోరుముంతల ప్రవీణ్ కుమార్, సురేందర్ రెడ్డి, కరీం, సలీం, స్వామి రెడ్డి, శంకర్ రెడ్డి, లింగారెడ్డి, ఇతర ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి

**సికింద్రాబాద్ ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్ మండి లో ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నందారం సీతారాం ఆధ్వర్యంలో సమతావాది అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 117 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షులు నందారం సీతారాం ఆధ్వర్యంలో నిర్వహించగా స్థానిక కార్పొరేటర్ సామల హేమ, వి ఆర్ ప్రసాద్, కె. విద్యాసాగర్, భాస్కర్ గిరి, ఏడుకొండలు, జివి క్రృష్ణ, ప్రసాద్ రావు, గోవర్ధన్, బాబు రావు, లక్ష్మి,లలిత, చల పతి, రాజు (బిజేపి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.




## మెట్ పల్లి కి చెందిన భూపతి గౌడ్ కు ఘన సన్మానం



**మెట్ పల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** పట్టణానికి చెందిన నటరాజ నృత్య కళానిలయం వ్యవస్థాపకులు, ప్రముఖ నృత్య కళాకారుడు భూపతి గౌడ్ కు మల్లాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇక్కడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్, రిజియన్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, అఖిలపక్షం పార్టీల నాయకులు ముద్దం సత్యనారాయణ గౌడ్, మగ్రిపల్లి మల్లయ్య, ముద్దం చంద్రప్రకాష్ గౌడ్, కోటగిరి ఆనంద్ గౌడ్, గొట్టి పడత రాజు తదితరు పాల్గొన్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**గొల్లపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** మాజీ ఉపప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 117వ వేడుకలను గొల్లపల్లి గ్రామంలో శుక్రవారము ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా మండల కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఈసీ నల్ల శ్యామ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు .ఆయన దేశానికి ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలను కొనియాడారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గొర్రె జాకబు,భోజనపు శ్రీనివాస్ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం



**గొల్లపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో గత రెండు రోజులుగా జిపి ట్రాక్టర్ డీజిల్ లేక రోడ్డు పక్కన నిరుపయోగంగా ఉంది. అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది . జిపి అధికారుల నిర్లక్ష్యంతో డ్రైనేజీలు నుండి మురికి నీరు రోడ్లపైకి పొంగి పొర్లతూ స్థానికులకు దుర్వాసన వెదజల్లుతోంది. మురికి కాలువల్లో ఇటీవల తీసిన చెత్తను రోడ్లపై నిర్లక్ష్యంగా వదిలేయడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఒకరు డెంగ్యూ జ్వరంతో మృతి చెందినప్పటికీ పట్టించుకున్న నాధులు కరువయ్యారనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసిన జిబి కార్యదర్శి చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు గ్రామంలో మిషన్ భగీరథ నీరు మురికిగా వస్తున్నప్పటికీ జిపి కార్యదర్శి పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరుతున్నారు.

## మల్లాపూర్ లో పట్ట పగలు దారుణ హత్య



**మల్లాపూర్ ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** మల్లాపూర్ మండల కేంద్రంలోని మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో దారుణ హత్య జరగడంతో ఆ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అంబదాస్ అను 54 సంవత్సరాల వ్యక్తి చాల సంవత్సరాల క్రితం హుస్నాబాద్ నుండి వలస వచ్చి మల్లాపూర్ లో దుర్గమ్మ కాలనీలో నివాసం ఉంటూ కిరాణషాపులో కూలీ పనిచేస్తున్నాడు. కాగా అతను గత 15 సంవత్సరాల క్రితం కండెల బోజవ్వ అను వివాహితను రెండవ పెళ్ళి చేసుకోగా ఆమెకు మొదటి భర్త ద్వారా కలిగిన సంతానం కండెల రవితేజ అను కొడుకు ఉన్నాడు. ప్రస్తుతం అతను తల్లితో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో రవితేజ చాల కాలంగా పని చేయకుండా జులాయిగా తిరగడంతో తండ్రి సమానుడైన అంబదాస్ సదరు యువకుడు కండెల రవితేజను ఏదైనా పని చేసుకోమని మందలించగా కోపం పెంచుకున్న అంబదాస్ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అంబదాస్ ను కండెల రవితేజ (21) పదునైన ఆయుధంతో గొంతు కోసి హత్య చేసాడు. సంఘటనా స్థలానికి డిఎస్పీ, సి, ఎస్సై కిరణ్ కుమార్ చేరుకొని కేసు నమోదు చేసి ధర్యాప్తు నిర్వహించారు.

## ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**సైదాపూర్ ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** సైదాపూర్ మండల కేంద్రంలో బస్టాండ్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం భారత దేశ మాజీ ఉప ప్రధాని, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాదేపాక అశోక్, గున్నాల కృష్ణమూర్తి, అనిల్, దేవిడ్ రాజయ్య, సందీప్, రమేష్ , కుమార్, మహేందర్, దాసరి రవీందర్, పర్ష చంద్రమౌళి, రవి మహేష్, తదితరులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను విజయవంతంగా సైదాపూర్ మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది.

## మిషన్ భగీరథ ప్రధాన పైపులైను మరమ్మత్తులు

### 6, 7 తేదీలలో నీటి సరఫరా ఉండదు - ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలి

**గొల్లపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):** ధర్మపురి నియోజకవర్గాలలోని (వెల్గటూరు, ఎండపల్లి ధర్మపురి మున్సిపాలిటీ మినహాయించి) ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేయునది మెట్ పల్లి మండలంలోని వెంకట్రావుపేట గ్రామం వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్రధాన పైపులైను మరమ్మత్తులు చేయడం జరుగుతుంది. ఇందుకోసం అవసరమైన సామాగ్రి హైదరాబాద్ నగరం నుండి సమకూర్చడం జరిగింది. కావున రెండు రోజులు అనగా 6, 7 తేదీలలో మిషన్ భగీరథ నీరు ఇవ్వలేము. ఈరోజు సరఫరా చేయబడిన నీటిని పొదుపుగా వాడుకుంటూ, గ్రామం మున్సిపాలిటీలలో ఉన్న బోరు, చేతి పంపులు బావినీరు ఉపయోగించుకొనుటకు తగు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోగలరని దీనికి అందరూ సహకరించగలరని కార్య నిర్వహణ అధికారి జి. శేఖర్ రెడ్డి తెలిపారు.

# కౌన్ బనేగా మెంబర్ ఆఫ్ పార్లమెంట్, కరీంనగర్

**తెరమీదికి రోజుకొక పేరుతో సోషల్ మీడియాలో వైరల్**

**ప్రస్తుతం గంగుల కమలాకర్ కు సీఎం గ్రీన్ సిగ్నల్ అంటూ వైరల్**

**తీన్మార్ మల్లన్నకే అంటూ మరో లీక్**

**అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి లేదా వెలిచాల రాజేందర్ రావు ఇద్దరిలో ఒకరికి ఛాన్స్ అంటూ మరో కథనం**

**జన బలంలో ప్రవీణ్ రెడ్డి ముందంజ**

## కరీంనగర్ ఎంపీ సీటు రెడ్డీలకా!, వెలమలకా!, బీసీలకా!

(కాశిరెడ్డి ఆదిరెడ్డి, ప్రజామంటలు ప్రతినిధి, భీమదేవరపల్లి)

**భీమదేవరపల్లి ఏప్రిల్ 05 (ప్రజామంటలు):**

కరీంనగర్ ఎంపీ సీటు రెడ్డీలకా, వెలమలకా, బీసీలకా హాలీవుడ్ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలదన్నేలా కరీంనగర్ ఎంపీ సీట్ సస్పెన్స్.....మంత్రి పొన్నం "పోల్" ఎటువైపు?

**కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం కరీంనగర్ అభ్యర్థి ఖరారు అంశాన్ని అన్ని కోణాలలో ఆలోచిస్తూ, తాత్కాలికంగా పక్కన పెట్టింది.**

**పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ:**

రాష్ట్ర రాజకీయాలకు సంబంధించి అత్యంత కీలకమైన కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతుండగా, పార్టీ శ్రేణులు తీవ్ర ఉత్కంఠకు లోనవుతున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలోనూ చివరి క్షణం వరకు అభ్యర్థులను తేల్చలేని పరిస్థితుల్లో ప్రచారానికి తగినంత సమయం లేక కరీంనగర్, హుజూరాబాద్ స్థానాలను 'చే' జార్చుకోవాల్సి వచ్చింది.

**బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో ముందంజ:**

ఇప్పటికే కరీంనగర్ స్థానం నుండి సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ కుమార్, బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్‌లు ప్రచారంలో దూసుకుపోతున్నారు. దీంతో వీరిరువురూ నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు.

**ఏఐసీసీ పరిశీలనలో అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ముందంజ:**

కరీంనగర్ స్థానం నుండి పోటీకి కాంగ్రెస్ నేతలు అనేకమంది పోటీపడినప్పటికీ, చివరకు మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, మరో మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు తనయుడు రాజేందర్ రావు పేర్లు మాత్రమే ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ పరిశీలనలోకి వచ్చాయని సమాచారం. వీరిద్దరి మధ్య నువ్వా నేనా అనే రీతిలో ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ జరుగుతున్నప్పటికీ అధిష్టానం ప్రవీణ్ రెడ్డి వైపే ముగ్గు చూపుతుందని విశ్వసనీయ సమాచారం.

**వెలమ వర్సెస్ రెడ్డి... నువ్వా ? నేనా ?...**

రాష్ట్రంలో మరెక్కడా వెలమలకు అవకాశం కల్పించకపోవడం, కరీంనగర్ లోక్‌సభ స్థానం మొదటి నుండి వెలమల కంచుకోటగా గుర్తింపు పొందడంతో రాజేందర్ రావు అభ్యర్థిత్వ ఖరారు విషయంలో అడ్డంకులు ఏవీ లేవనే చర్చ కొనసాగింది. అదే సమయంలో కరీంనగర్ లోక్ సభ పరిధిలో బలమైన సామాజిక వర్గం రెడ్ల ఆధిపత్యం కూడా ఎక్కువగా ఉండడంతో అధిష్టానం పునర్ ఆలోచనలో పడింది.

**'పొన్నం' కు సీటు త్యాగం:**

గత లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూసిన పొన్నం ప్రభాకర్ మొన్నటి శాసనసభ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకొని గెలుపొంది, రాష్ట్ర మంత్రివర్గంలో స్థానాన్ని సంపాదించారు. స్థానికుడైన మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి శాసనసభ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు లోబడి తన స్థానాన్ని పొన్నం ప్రభాకర్ కోసం త్యాగం చేశారు.









**అధిష్టానం హామీ పైనే అలిగిరెడ్డి ఆశలు:**

శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పార్టీ అధిష్ఠానం టికెట్ తనకే కేటాయిస్తుందనే నమ్మకంతో ప్రవీణ్ రెడ్డి లోక్ సభ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ కమిటీ ప్రవీణ్ రెడ్డి పేరు ఒకటి మాత్రమే ఏఐసీసీకి పంపడంతో ఆయన ఎంపిక లాంఛనమే అని అంతా భావించారు.

**పొన్నం "పోల్" ఎవరికో అంతుచిక్కని బ్రహ్మ పదార్థం:**

ప్రవీణ్ రెడ్డి అభ్యర్థిత్వం తొలి విడతలోనే ఖరారు అవుతుందని అనుకున్నారు. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రం వెలిచాల రాజేందర్రావు వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా పార్టీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను ఆయన కూడగట్టినట్టు సమాచారం. పొన్నం 'పోల్' ఎటువైపో ఎవరికి అంత చిక్కని బ్రహ్మ పదార్థంగా తయారైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**సందిట్లో సడే మియా తీన్మార్ మల్లన్న:**

అసలే ఓ వైపు వెలిచాల, అలిగిరెడ్డి ల మధ్య ఎంపీ సీటు దోబూచులాడుతుంటే మధ్యే మార్గంగా కరీంనగర్ స్థానం నుండి బీసీ వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్నను నిలబెట్టాలనే ప్రతిపాదన సోషల్ మీడియాలో వైరల్ అయింది. బరిలో తీన్మార్ మల్లన్న అంటూ అనేక ఊహాగానాలు మొదలయ్యాయి.

**ప్రవీణ్ రెడ్డికి టికెట్ విషయంలో సీఎం రేవంత్ గట్టి పట్టు:**

కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి అభ్యర్థిత్వం పైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు పార్టీ వర్గాల సమాచారం. ప్రవీణ్ అభ్యర్థిత్వం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టి పట్టుదలతో ఉండటంతో, అధిష్టానం సస్పెన్స్ కొనసాగిస్తుంది.

**నాయకుల మధ్య సమన్వయం లేకపోవడమే సమస్య:**

నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడమే, ఎంపిక ప్రక్రియలో జాప్యానికి కారణమని కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. ఆధిపత్య రాజకీయాలే కరీంనగర్ అభ్యర్థి ఎంపిక విషయంలో ఎదురవుతున్న చిక్కు ముళ్ళకు కారణమని ఆయన తేల్చేశారు.

**గంగులకు టిఆర్ఎస్ గ్రీన్ సిగ్నల్ అంటూ సోషల్ మీడియాలో హైప్:**

కరీంనగర్ టిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు, కరీంనగర్ ఎంపీ బరిలో గంగులను దించి టిఆర్ఎస్ కు చెక్ పెట్టాలని సోషల్ మీడియాలో వైరల్ అయింది కానీ, శుక్రవారం మాజీ సీఎం కెసిఆర్ పర్యటనలో అన్ని తానై గంగుల వ్యవహరించడం ఊహాగానాలకు ఫుల్ స్టాప్ పెట్టినట్లు అయింది.

**కొస మెరుపు:**

ఇప్పటివరకు జరిగిన టికెట్ల కేటాయింపును పరిశీలిస్తే స్థానిక నాయకత్వాల అభ్యంతరాలను పార్టీ హైకమాండ్ పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదని స్పష్టమవుతున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి ఖరారు విషయంలో మంత్రి, శాసనసభ్యులు, మాదిగలు పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం చేసినా, త్రోసి రాజని.. చెన్నూరు శాసనసభ్యుడు గడ్డం వివేక్ తనయుడు వంశీ కి టికెట్ ఖరారు చేసింది. కరీంనగర్ అభ్యర్థి ఎంపిక విషయంలోనూ చివరకు ఇదే పునరావృతం అవుతుందనే టాక్ వినిపిస్తోంది.

# పాత సినిమాలకు కొత్త అతుకులు
# అంతగా కనెక్ట్ కాలేకపోయిన ఫ్యామిలీస్టార్



విజయ్ దేవరకొండకి ఒక పెద్ద బ్రేక్ వచ్చి చాలా సంవత్సరాలు అవుతోంది. అటువంటి సమయంలో ఇప్పుడు ఈ 'ది ఫామిలీ స్టార్' సినిమా విడుదలైంది. దీనికి పరశురామ్ దర్శకుడు, మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. దిల్ రాజు, శిరీష్ సోదరులు నిర్మాతలు. గోపి సుందర్ సంగీతం అందించారు. ఈ సినిమా శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యింది. గోవర్ధన్ (విజయ్ దేవరకొండ) ఒక మధ్యతరగతి కుటుంబంలో ఆఖరివాడు. ఇద్దరు అన్నయ్యలు, వదినలు, వాళ్ళ పిల్లలు, బామ్మ, ఇలా ఒక మధ్యతరగతి కుటుంబంలో చిన్నవాడైన గోవర్ధన్ కుటుంబాన్ని తన భుజస్కందాలపై నడిపిస్తూ వుంటారు. ఎప్పుడూ ఎక్కడ అదా చెయ్యాలి, ఎలా డబ్బులు అదా చేయెచ్చు అని చూస్తూ ఉంటాడు. ఒక అన్నయ్య ఎప్పుడూ తాగుతూ మద్యం నడిపే దుకాణదారుడితో గొడవపడుతూ ఉంటాడు. అన్నయ్య పిల్లల స్కూల్ ఫీజులు, వాళ్ళ అవసరాలు అన్నీ గోవర్ధన్ చూసుకుంటూ సంపాదనలో అన్నీ జాగ్రతగా ఖర్చు పెడుతూ ఉంటాడు. అలాగే తన కుటుంబసభ్యులని ఎవరైనా ఏమైనా అన్నా ఊరుకునే మనస్తత్వం కూడా కాదు గోవర్ధన్ ది, ఎదురుతిరిగి తగిన బుద్ధి చెపుతూ వుంటాడు. అలాంటి సమయంలో ఆ ఇంట్లోకి వస్తుంది ఇందు (మృణాల్ ఠాకూర్) అనే అమ్మాయి. గోవర్ధన్ ఉంటున్న ఇంట్లోనే మేడ మీద ఒక గది ఖాళీగా ఉంటే అద్దెకి దిగుతుంది. గోవర్ధన్ మొదట్లో ఆమెని వ్యతికేరించినా, మెల్లగా ఆమె చేస్తున్న పనులు నచ్చి ఆమెతో ప్రేమలో పడతాడు, పెళ్లి కూడా చేసుకుందాం అనుకుంటాడు. అదే సమయంలో ఆమె గోవర్ధన్ మీద ఒక థీసిస్ రాస్తుంది, అది తను చేసే మధ్యతరగతి కుటుంబం గురించిన రీసెర్చ్ అని యూనివర్సిటీ లో సబ్మిట్ చేస్తుంది. అందులో గోవర్ధన్ మధ్యతరగతి కుటుంబం గురించిన వివరాలు అన్నీ ఉంటాయి. గోవర్ధన్ ఆ పుస్తకం చదివి తన కుటుంబాన్ని మొత్తం రోడ్డుమీదకు ఇందు తీసుకువచ్చిందని, ఆమెని అసహ్యించుకుంటాడు. మధ్య తరగతి కుటుంబం అంటే పస్తులుండే కుటుంబం కాదని, తలుచు కుంటే మేము కూడా సంపన్నులం కాగలమని చూపిస్తాడు. వెంటనే తనకి ఇంతకు ముందు ఆఫర్ ఇస్తామన్న ఒక పెద్ద వ్యాపారవేత్త (జగపతి బాబు) దగ్గరికి వెళ్లి తాను ఇప్పుడు ఆ జాబ్ తీసుకుంటానని ప్రాధేయపడితే అతను గోవర్ధన్ కి ఆ జాబ్ ఇస్తాడు, అలాగే రెండు సంవత్సరాల జీతం అడిగితే అది కూడా ముందే ఇస్తాడు. తాను మధ్యతరగతి కుటుంబం కాదని, ధనవంతుల కుటుంబం అని ఇందుకు చెప్తాడు, ఆమె మీద ద్వేషం పెంచుకుంటాడు. ఇంతకీ ఈ ఇందు అనే అమ్మాయి ఎవరు? ఆమె నిజంగానే గోవర్ధన్ మధ్యతరగతి కుటుంబాన్ని వీధిలోకి లాగడం కోసమే థీసిస్ రాసిందా? ఆ వ్యాపారవేత్త గోవర్ధన్ అడగగానే వుద్యోగం, జీతం ఇచ్చి ఎందుకు పెట్టుకున్నాడు? గోవర్ధన్, ఇందు మళ్ళీ కలిసారా? వాళ్ళు పెళ్లిచేసుకున్నారా? తరువాత ఏమైంది, గోవర్ధన్ జీవితం ఎటువంటి మలుపులు తిరిగాయన్నదే 'ది ఫామిలీ స్టార్' సినిమా కథ. దర్శకుడు పరశురామ్ మంచి రచయిత. అతని ముందు సినిమాలు చూస్తే అవన్నీ అర్థం అవుతాయి. అతను, విజయ్ దేవరకొండ కాంబినేషన్ లో ఇంతకు ముందు వచ్చిన 'గీత గోవిందం' చాలా పెద్ద హిట్ అయిన సినిమా. ఇప్పుడు మళ్ళీ ఈ ఇద్దరూ ఒకటై ఈ 'ది ఫ్యామిలీ స్టార్' సినిమాతో రావటంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. స్వతహాగా సమాజం, కుటుంబ విలువలు ఇలాంటి వాటి గురించి పరశురామ్ ఇంతకు ముందు సినిమాలలో బాగా చెప్పగలిగాడు, ఈ 'ది ఫ్యామిలీ స్టార్' కూడా మధ్యతరగతి కుటుంబానికి చెందిన కథ అని ముందుగా చెప్పడంతో కొంచెం ఆసక్తి పెరిగింది. మధ్య తరగతి కుటుంబంలోకి ఒక ధనవంతురాలు/ ధనవంతుడు సాధారణ మనిషిలా వచ్చి ఆ కుటుంబలో ఒక సభ్యుడిగా మారిపోయి, ఆ కుటుంబాన్ని వాళ్ళకి తెలియకుండా ఆదుకుంటూ ఉండటం, ఆ తరువాత ఒక చిన్న సంఘటనతో వాళ్ళిద్దరిమధ్య తేడాలు రావటం మళ్ళీ కలుసుకోవటం. ఇలాంటి సినిమాలు చాలానే వచ్చాయి, ఇక్కడ పరశురామ్ కూడా అలాంటి ఒక పాత కథనే ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునికంగా చెప్పాలని అనుకున్నాడు. ఇందు అనే అమ్మాయి ఆ ఇంట్లోకి రావటం, ఆమెతో గోవర్ధన్ ప్రేమలో పడటం, ఆమె ఈ కుటుంబం గురించి రీసెర్చ్ చేసి థీసిస్ రాయటం, వాళ్ళిద్దరి మధ్యలో మళ్ళీ చిన్న తేడాలు రావటం వరకు బాగానే వుంది. అయితే ఇక్కడే పరశురామ్ కొంచెం కథ మీద దృష్టి పెట్టలేదు అనిపిస్తోంది. ఎందుకంటే రెండో సగం మొదట్లో వచ్చే ఈ అమెరికా సన్నివేశాలన్నీ ప్రేక్షకుడికి చాలా బోర్ ఫీలవటమే కాకుండా, అవన్నీ వేరే కథలా అనిపిస్తుంది. రెండో సగం అంతా దానిపైనే ఉండటం అదీ సాగదీసినట్టుగా అనిపిస్తుంది. సినిమాకి ఆయువుపట్టు అయిన పతాక సన్నివేశం కూడా దర్శకుడు అంత బాగా తీయలేదు అన్నట్టుగా అనిపిస్తుంది. ఇక నటీనటుల విషయానికి వస్తే విజయ్ దేవరకొండ మధ్యతరగతి కుటుంబంలో బాధ్యతలు మోసే అబ్బాయిగా చాలా బాగా చేసాడు. 'గీత గోవిందం' సినిమా తరువాత అటువంటి పాత్రలాగే ఇది కూడా కొంచెం వుంది అనిపిస్తుంది. విజయ్ మంచి ప్రతిభ గల నటుడు తనకిచ్చిన పాత్రల్లో ఇమిడిపోతాడు, ఇందులో కూడా అలానే గోవర్ధన్ పాత్రలో ఇమిడిపోయాడు. కానీ కథ బలంగా లేనప్పుడు అతనుమాత్రం ఏమి చేస్తాడు. ఇక మృణాల్ ఠాకూర్ పాత్ర అంత బలంగా లేదు, అదీ కాకుండా విజయ్, మృణాల్ మధ్య ఆ కెమిస్ట్రీ అంతగా వర్కవుట్ కాలేదు అనిపిస్తుంది. రెండో సగంలో వెన్నెల కిశోర్ వస్తాడు, అతని కామెడీ చూసి చూసి మరీ బోర్ అయిపొయింది. ఏ సినిమాలో చూసిన అదే వినోదం, అవే సన్నివేశాలు అతనివి అనిపిస్తుంది. 'ది ఫామిలీ స్టార్' అనే సినిమా మధ్య తరగతి కుటుంబానికి సంబందించిన కథ అని చెప్పినా, ఆ కుటుంబంలో జరిగే సంఘర్షణలని బలంగా దర్శకుడు పరశురామ్ చూపించలేకపోయాడు.

## ప్రభాస్‌తో దిశాపటాని సెల్ఫీ




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కల్కి 2898 ఏడీ'సైన్స్ ఫిక్షన్ జానర్‌లో వస్తున్న ఈ చిత్రానికి మహానటి సినిమా ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా భారతీయ పురాతన ఇతిహాసం మహాభారతం కాలం నుంచి ప్రారంభమై 2898 సంవత్సరంతో పూర్తయ్యే స్టోరీతో ఈ మూవీ రానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. కాగా ఇటీవల చిత్ర యూనిట్.. ప్రభాస్ అండ్ దిశా పటానీపై ఒక సాంగ్ చిత్రీకరణకోసం ఇటలీ వెళ్లారు. ఇటలీలోని ఓ ఐలాండ్‌లో ప్రభాస్, దిశాపటానీపై వచ్చే రొమాంటిక్ సాంగ్ తెరకెక్కిస్తున్నారు. ఇక ఆ షూటింగ్ సెట్స్ నుంచి మూవీ టీం, టెక్నికల్ వర్కింగ్ ఫోటోలు కొన్ని వచ్చి ఇప్పటికే వైరల్ అయ్యాయి. అయితే ఈ పాటకు సంబంధించి షూటింగ్ కంప్లీట్ అయ్యినట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించి తాజాగా ఆ షూటింగ్ లోకేషన్‌లో ఉన్న ఫొటోలను దిశా దిశాపటానీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇక ఈ ఫొటోలలో ప్రభాస్‌లో సెల్ఫీ కూడా దిగింది దిశాపటానీ. దీనితో పాటు ఇటలీలోని అందమైన లోకేషన్ ఫొటో లను తన ఇన్‌స్టాలో పంచుకుంది ఈ భామ. కాగా ప్రస్తుతం ఈ సెల్ఫీ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది.

## రామాయణ దృశ్యకావ్యం - ఆస్కార్ విజేతల సంగీతం


ఎన్ని సార్లు చూసిన మళ్లీ మళ్లీ చూడాలనిపించే అద్భుతమైన దృశ్య కావ్యం రామాయణం. ఈ ఇతిహాస కథతో ఇప్పటికే పదుల సంఖ్యలో సినిమాలు, సీరియల్స్ వచ్చిన విషయం తెలిసిందే. గతేడాది ప్రభాస్ కూడా ఆదిపురుష్ అంటూ మోషన్ క్యాప్చర్‌తో సినిమా తీసి ప్రేక్షకులను అలరించాడు. అయితే రామాయణం కాన్సెప్ట్‌తో మరో మూవీ రాబోతుంది. దంగల్ దర్శకుడు నితీష్ తీవారి మరోసారి ఈ ఇతిహాస కథను తెరపైకి తీసుకురావడానికి రెడీ అయ్యాడు. యానిమల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగం కానుండగా.. త్వరలో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. ఇక ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, శాండల్‌వుడ్ స్టార్ యష్ రావణుడిగా నటించనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ సంబంధించి ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్ సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మూవీకి సంగీతం అందించడం కోసం ఇద్దరు ఆస్కార్ విన్నర్లు రాబోతున్నారట. ఇందులో ఒకరు ఇండియన్ ఆస్కార్ విన్నర్ ఏ ఆర్ రెహమాన్ కాగా.. ఇంకొకరు హాలీవుడ్ ఆస్కార్ విన్నర్ హన్స్ జిమ్మెర్. వీరిద్దరూ కలిసి రామయణం సినిమాకు సంగీతం అందించనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ విషయంపై నితీష్ తీవారి ఏ ఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం. ఇక ది లయన్ కింగ్, డార్క్ నైట్ ట్రయాలజీ, ఇన్‌సెప్షన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు హన్స్ జిమ్మెర్. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి రోజున ఈ సినిమాను అధికారికంగా ప్రకటించనున్నట్లు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్. వచ్చే నెలలో ముంబైలో షూటింగ్ ప్రారంభమవుతుందని.. అలాగే ఈ ప్రాజెక్ట్ మొదటి భాగాన్ని 2025 దీపావళికి విడుదల చేయడానికి ప్లాన్ చేయనున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ ప్రాజెక్ట్‌లో సన్నీ డియోల్, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

# ఉప్పల్‌లో ఎక్కడ చూసినా పసుపు జెర్సీలే



ఐపీఎల్ 2024లో భాగంగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్–చెన్నై సూపర్ కింగ్స్ మధ్య బిగ్ ఫైట్ జరుగనుంది. ఉప్పల్ స్టేడియం వేదికగా రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే.. సన్ రైజర్స్?కు ఉప్పల్ హోంగ్రౌండ్. అయితే.. అక్కడ ఆ పరిస్థితులు కనపడటం లేదు. ఉప్పల్ స్టేడియం చుట్టూ పసుపుమయంగా మారిపోయింది.

ఎక్కడ చూసినా పసుపు జెర్సీలే కనపడుతున్నాయి. దానికి కారణమేంటంటే.. సీఎస్కే జట్టులో ధోనీ ఉండటం. ధోనీ అంటే.. క్రికెట్ అభిమానులకు ఎంతో అభిమానం. అందుకోసమని తమ టీమ్ ను కాదని.. మరో టీమ్ ను సపోర్ట్ చేయడమంటే ధోని గొప్పతనం. మొన్న విశాఖలో జరిగిన సీఎస్కే–ఢిల్లీ మ్యాచ్ లో కూడా ఇవే పరిస్థితులు కనపడ్డాయి. ఢిల్లీ క్యాపిటల్స్ కు విశాఖ స్టేడియం హోంగ్రౌండ్.. అయినప్పటికీ సీఎస్కే తరుపున అభిమానులు సపోర్ట్ చేశారు. ఆ మ్యాచ్ లో సీఎస్కే ఓడిపోయినా.. ధోనీ మాత్రం అభిమానుల మనసును గెలిచాడు. ఈరోజు కూడా హైదరాబాద్ అభిమానులంతా ధోనీ వైపే ఉన్నారు. ఈ క్రమంలో.. ధోనీ పేరుతో స్టేడియం పరిసరాలు మార్మోగుతున్నాయి. హైదరాబాద్ ఫ్యాన్స్ సైతం.. ఈ మ్యాచ్ వరకు చెన్నై వైపే ఉన్నారు. మరోవైపు.. ధోనీ కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉప్పల్ స్టేడియంకు భారీగా తరలి వచ్చారు ఫ్యాన్స్. మ్యాచ్ టికెట్ దొరకకపోయినా స్టేడియం వద్ద క్రికెట్ ఫ్యాన్స్ వేలాదిగా వేచి చూస్తున్నారు. ఇదిలా ఉంటే.. మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ చెన్నై సూపర్ కింగ్స్ పై గెలువాలని కసితో ఉంది. ఇప్పటికే ఆడిన మూడు మ్యాచ్ ల్లో రెంటింటిలో ఓడిపోయి.. ఒక్క మ్యాచ్ లో గెలిచింది.



## హెచ్‌సీఏ వెర్సస్ విద్యుత్ శాఖ.. కుదిరిన సయోధ్య

ఐపీఎల్ 2024లో భాగంగా ఏప్రిల్ 5న పోరు హోరాహోరీగా సాగనుంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ నువ్వా.. నేనా అనేది తేల్చుకోనున్నాయి. రాత్రి 7:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సన్‌రైజర్స్ బ్యాటర్ల విధ్వంసం తిలకించేందుకు అభిమానులు భారీగా తరలి రానున్నాయి. ఈ నేపథ్యంలో మ్యాచ్ జరగడానికి కొన్ని గంటల ముందు కొన్ని నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ కీలక మ్యాచ్‌కు ముందు ఉప్పల్ స్టేడియం అంధకారంలో చిక్కుకుంది.. బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు పవర్ కట్ చేశారు. స్టేడియం నిర్వాహకులు బిల్లులు చెల్లించకుండా.. రూ.1.67 కోట్లు విద్యుత్ వాడుకున్నారని విద్యుత్ శాఖ తెలిపింది. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా హెచ్‌సీఏ పట్టించుకోలేదని, నోటీసులకు స్పందించకపోవడంతోనే విద్యుత్ సరఫరాను కట్ చేసినట్లు చెప్పారు. ఇక స్టేడియం నిర్వాహకుల వాదన మరోలా ఉంది. విద్యుత్ శాఖ అధికారులు క్రికెట్ మ్యాచ్‌ను చూసేందుకు అడిగిన పాసులు ఇవ్వక పోవడంతో పవర్ కట్ చేరని %ఎజూా% చెబుతోంది. ఏదీ ఏమైనా హెచ్‌సీఏ అధికారులు చర్చలు జరపడంతో ఎట్టకేలకు గురువారం రాత్రి 9 గంటలకు అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.. ఇదిలా ఉండగా, ఐపీఎల్‌ను క్యాష్ చేసుకుంటూ హైదరాబాద్ ఉప్పల్ క్రికెట్ స్టేడియం ఎదుటే బ్లాక్ టికెట్ల దందా కొనసాగుతోంది. ఎలాగైనా మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలని ఉవ్విళ్లూరుతోన్న క్రికెట్ అభిమానుల ఆశను ఆసరాగా చేసుకుని కొందరు బ్లాక్‌లో టికెట్లు అమ్ముతున్నారు. 35 వేల సామర్థ్యమున్న ఉప్పల్ స్టేడియం టికెట్లను పెద్ద సంఖ్యలో బ్లాక్ చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. టికెట్లతో పాటు కాంప్లిమెంటరీ పాసులను కూడా బ్లాక్‌లో అమ్ముతున్నారు. అయితే అక్రమంగా టికెట్ల పంపకాలకు %ఎజూా% తెరలేపినట్టు బహిరంగ విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఏకంగా స్టేడియం ఎదుటే బ్లాక్ టికెట్ దందా మొదలైంది. టికెట్లతో పాటు కాంప్లిమెంటరీ పాసులను బ్లాక్‌లో అమ్ముతున్న ముఠాను గతంలో పోలీసులు అరెస్టు చేశారు. ఐపీఎల్ టికెట్ల పక్కదారి పడుతున్నాయని ఆరోపిస్తున్నారు అభిమానులు. 1500 టికెట్‌ను రూ. 5వేలుగా, రూ. 4వేల టికెట్‌ను రూ. 9 వేలుగా, రూ. 6 వేల టికెట్ రూ. 12 వేలు చొప్పున బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ పరిణామాల మధ్య అసలు ఉప్పల్ స్టేడియంలో ఏం జరుగుతోందనే అనుమానం కలిగింది. అయితే ఒకవైపు ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంది. పోలీసులు, ప్రభుత్వం కూడా ఎన్నికల పై దృష్టి పెట్టింది. ఇదే అదునుగా %ఎజూా% పాలకవర్గం రెచ్చిపోయింది. స్టేడియం కెపాసిటీ ఎంత..? ఎన్ని టికెట్లు అమ్మకానికి పెడతారు..? ఎన్ని టికెట్లు కాంప్లిమెంటరీ గా ఇస్తారు..? %ఖ్ఘుఎ% పారదర్శకంగా టికెట్లు అమ్ముతుందా లేదా..? ఇలాంటివి పట్టించుకునే నాథుడే లేడు. మునుపెన్నడూ లేని రీతిలో బ్లాక్ టికెట్ల దందా ఈసారి జరిగింది.

# కన్ఫ్యూజన్‌లో జట్టులోకి వచ్చి 'పంజాబ్' హీరో అయ్యాడు



ఐపీఎల్ నుంచి మరో టాలెంటడ్ బ్యాటర్ ప్రపంచ క్రికెట్‌కు పరిచయమయ్యాడు. తన అద్భుత బ్యాటింగ్‌తో జట్టుకు ఊహించని విజయాన్ని అందించాడు. ఓడిపోయే మ్యాచ్‌లో చెలరేగి.. తన జట్టుకు విజయం సాధించిపెట్టాడు. అతడు మరెవరో కాదు.. 'శశాంక్ సింగ్'. ఐపీఎల్ 2024లో భాగంగా గురువారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ బ్యాటర్ శశాంక్ సంచలన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సులతో 61 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 200 పరుగుల ఛేదనలో శిఖర్ ధావన్ (1), సామ్ కరణ్ (5), సికిందర్ రజా (15) వంటి వరల్డ్ క్లాస్ బ్యాటర్లు విఫలమైన చోట శశాంక్ సింగ్ సత్తాచాటాడు. పంజాబ్ కింగ్స్‌కు ఓటమి తప్పదనుకున్న వేళ.. శశాంక్ విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. 73 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన పంజాబ్‌ను శశాంక్ ఆదుకున్నాడు. ఓ వైపు వికెట్స్ పడుతున్నా.. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. ఫోర్లు, సిక్సలతో విరుచుకుపడి పంజాబ్‌కు ఊహించని విజయాన్ని అందించాడు. పంజాబ్ హీరో అయిన శశాంక్ ఎవరని నెటిజెన్స్ గూగుల్ చేస్తున్నారు. 1991 నవంబర్ 21న ముంబైలో శశాంక్ సింగ్ జన్మించాడు. ప్రస్తుతం ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఛత్తీస్‌గఢ్ తరఫున ఆడుతున్నాడు. ఇప్పటివరకు 21 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన శశాంక్.. 1072 పరుగులు చేశాడు. అంతకుముందు 2015–16 విజయ్ హజారే ట్రోఫీలో లిస్ట్–ఏ క్రికెట్లో ముంబై తరఫున అరంగేట్రం చేశాడు. లిస్ట్–ఏ కెరీర్‌లో 30 మ్యాచ్‌లు ఆడి 275 పరుగులు చేశాడు. అదే ఏడాదిలో సయ్యద్ ముస్తాక్ అలీతో ముంబై తరఫున టీ20 డెబ్యూ చేశాడు. టీ20ల్లో శశాంక్‌కు మంచి రి?కార్డు ఉంది. ఇన్నింగ్స్ చివరలో మెరుపులు మెరిపించడం శశాంక్ స్పెషాలిటీ. ఇప్పటివరకు 58 టీ20లు ఆడి 754 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో 60 వికెట్లు కూడా పడగొట్టాడు. ఐపీఎల్ 2017లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ శశాంక్ సింగ్‌ను రూ.10 లక్షలకు కొనుగోలు చేసింది. అయితే అతడికి ఆడే అవకాశం రాలేదు. 2019, 2020 సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ తీసుకున్నా.. డెబ్యూ ఛాన్స్ రాలేదు. ఐపీఎల్ 2022 మెగా వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అతన్ని రూ.20 లక్షల?కు సొంతం చేసుకుంది. ఆ సీజన్‌లో చెన్నైపై ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఐపీఎల్ 2023 వేలంలో అతడిని సన్‌రైజర్స్ వదిలేసింది. 2023లో శశాంక్‌ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. ఐపీఎల్ 2024 వేలంలో ఒకే పేరుతో ఇద్దరు ఆటగాళ్లు ఉండటంతో.. పంజాబ్ సహయజమాని ప్రీతి జింటా పొరపడ్డారు. 19 ఏళ్ల బ్యాటర్‌కు బదులుగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన శశాంక్‌ను రూ. 20 లక్షలకు కొనుగోలు చేశారు. శశాంక్‌ను సొంతం చేసుకున్న అనంతరం పంజాబ్ మేనేజ్‌మెంట్ తమ పొరపాటును గ్రహించింది. అయితే పరువు పోకుండా శశాంక్ తమ టార్గెట్ లిస్ట్‌లో ఉన్నాడని కవర్ చేసింది. వేలం సమయంలో ప్రీతి జింటా పొరపాటు చేసినా.. ఇప్పుడు అదే ఆ జట్టుకు వరంలా మారింది. వద్దనుకున్న శశాంక్ సింగే.. రెండు మ్యాచులలో చెలరేగాడు. ఐపీయల్ 2024లో భాగంగా చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ భారీ స్కోర్ చేసేందుకు శశాంక్ సాయపడ్డాడు. ఆర్‌సీబీ పేసర్ అల్జారీ జోసెఫ్ వేసిన చివరి ఓవర్‌లో రెండు సిక్సర్లు, ఓ బౌండరీ బాది 20 పరుగులు పిండుకున్నాడు. శశాంక్ హిట్టింగ్‌తో పంజాబ్ పోరాడే స్కోర్ చేసింది. తాజాగా గుజరాత్ టైటాన్స్‌పై సంచలన ఇన్నింగ్స్ ఆడి అందరి దృష్టిని ఆకర్షించాడు.

## బెస్ట్ ఎటాకింగ్ జట్టుగా పంజాబ్ రికార్డ్

పంజాబ్ పేరులోనే ఒక పవర్ ఉంది. వాళ్లెప్పుడూ ఓటమిని అంత తేలిగ్గా ఒప్పుకోరు. చివరి వరకు పోరాడుతూనే ఉంటారు. అది వాళ్ల బ్లడ్ లోనే ఉంది. వారు పెరిగిన వాతావరణంలోనే ఉంది. కష్టం అంతే పడతారు. ఇష్టపడినా అలాగే ఉంటుంది. పోరాడినా అలాగే ఉంటుంది. ఇప్పుడు క్రికెట్ లో కూడా ఓడిపోతారని అంతా ఫిక్స్ అయిన తర్వాత పంజాబ్ కింగ్స్ గెలిచిన తీరు.. నభూతో నభవిష్యత్ అనాలి. కెప్టెన్ శుభ్ మన్ గిల్ (89 నాటౌట్) చెలరేగడంతో గుజరాత్ టైటాన్స్ 199 పరుగులు చేసింది. 200 పరుగుల లక్ష్యంతో పంజాబ్ బ్యాటింగ్ కి దిగింది. అయితే టాపార్డర్ లో ధావన్ (1), బెయిర్ స్టో( 22), శామ్ కరాన్ (5), సికందర్ రాజా (15) ఇలా చేసి అవుట్ అయ్యారు. ఈ సమయంలో అన్ క్యాప్ డ్ ప్లేయర్లు అదరగొట్టారు. ముఖ్యంగా శశాంక్ సింగ్ 29 బంతుల్లో 61 చేసి మ్యాచ్ ని నిలబెట్టాడు. తర్వాత ప్రభ్‌సిమ్రాన్ సింగ్ 24 బంతుల్లో 35 పరుగులు చేశాడు. తర్వాత అశుతోష్ రాణా 17 బంతుల్లో 31 పరుగులు చేసి విజయాన్ని అందించాడు.ఎటాకింగ్ లో ఇలా పంజాబ్ కింగ్స్ ఓ సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. ప్రత్యర్థి నిర్దేశించిన 200 పరుగులు, అంతకంటే ఎక్కువ టార్గెట్‌ను అత్యధికసార్లు ఛేదించిన తొలి జట్టుగా రికార్డులకెక్కింది. ఇలా మొత్తంగా ఆరు సార్లు 200 ప్లస్ టార్గెట్‌ను అందుకున్న తొలి జట్టుగా పంజాబ్ కింగ్స్ నిలిచింది. 17 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో పంజాబ్ కింగ్స్ ఎటాకింగ్ రికార్డ్ సొంతం చేసుకుంది. ఇప్పటివరకు మోస్ట్ సక్సెస్‌ఫుల్ టీమ్స్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ లాంటి జట్లకు సాధ్యం కాని రికార్డును పంజాబ్ కింగ్స్ సొంతం చేసుకోవడం విశేషం. ఒక్కసారి కూడా ఐపీఎల్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలవనప్పటికి ఆటలో తన మార్కు చూపిస్తూనే ఉంది. ఈసారి నుంచి ప్రత్యర్థులు పంజాబ్ ను ఎదుర్కునే ముందు, ఈ అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటారని సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

## టీ 20 ప్రపంచకప్‌లో రోహిత్, విరాట్ ఇన్.. గిల్ అవుట్: సైమన్

సైమన్ డౌల్.. ఇప్పుడు నెట్టింట ఆ పేరు వైరల్ అయ్యింది. ఎందుకంటే ప్రతి ఒక్కరు ఏదొక కాంట్రవర్సీ చేయడం, తమని ప్రమోట్ చేసుకోవడం నేడొక ఫ్యాషన్ అయిపోయింది. న్యూజిలాండ్ రేడియో వ్యాఖ్యాత, కామెంటేటర్, మాజీ ఆటగాడైన సైమన్ డౌల్ ఒక సంచలన ప్రకటన చేశాడు. అదేమిటంటే టీ 20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియాలో ఎవరెవరు ఉంటారనేదాని గురించి చెప్పాడు. అంటే తను ఒక అంచనా వేశాడు. యావద్భారత దేశమంతా ఎవరైతే ప్రధాన ఆటగాళ్లని అనుకుంటున్నారో వారి పేర్లే తను చెప్పాడు. ఇంతకీ వారెవరంటే టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఉంటారని., ఇంక శుభ్ మన్ గిల్ ఉండకపోవచ్చని అన్నాడు. విరాట్, రోహిత్ ఉన్నాక గిల్‌కు చోటు దక్కడం కష్టం అని అన్నాడు. ఇక వికెట్ కీపర్ బ్యాటర్‌లో తన బెస్ట్ ఛాయిస్ కేఎల్ రాహుల్ అని అన్నాడు. ఎందుకంటే అతను కీపర్ గా, ఇటు బ్యాటర్ గానూ ఉపయోగపడతాడని చెప్పాడు. అతన్ని వదులుకోవడం అంత మంచి నిర్ణయం కాదని తెలిపాడు. మరోవైపు ఓపెనర్ గా రోహిత్ శర్మ, యశస్వి జైశ్వాల్ వస్తే, ఫస్ట్ డౌన్ గిల్ వస్తే, సెకండ్ డౌన్ విరాట్ వస్తాడు. ఇది సీక్వెన్స్, కాకపోతే గిల్ ఓపెనర్ గా తప్ప, ఎక్కడా సెట్ కాడని అన్నాడు. అందుకని ఈ టోర్నమెంటులో అతను ఫెయిల్ కావడం ఖాయమని అన్నాడు. తను కంఫర్ట్ గా ఆడే ప్లేస్ లేనప్పుడు జట్టులో ఎంపికచేయడం సరికాదని అన్నాడు. ఈ విషయంలో న్యూజిలాండ్ ప్లేయర్ సైమన్ వార్తలపై తీవ్ర వ్యతిరేకత వస్తోంది. శుభ్ మన్ గిల్ ను ఎందుకు వదంటున్నావు. అతను పంజాబ్ కింగ్స్ పై అద్భుతంగా ఆడాడు. 48 బంతుల్లో 89 పరుగులు చేయడమే కాదు, నాటౌట్ గా ఉన్నాడని అంటున్నారు. ఇది కూడా మరిచిపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. అలాగే విరాట్ మొదటి రెండు మ్యాచ్ లు అద్భుతంగా ఆడాడు, రోహిత్ కూడా గేర్ మార్చుతాడు. నీకు ఇష్టం లేకపోతే, ప్రపంచానికి ఇష్టం లేనట్టు మాట్లాడటం కరెక్టు కాదని గట్టిగానే కౌంటర్లు ఇస్తున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com